



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 297 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు గురువారం 3 జూలై 2025 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE : 297 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE THU 3 JULY 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

# ఏడాది కాలంగా ఇదే మా పాలసీ

- కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన
- దేశంలోనే కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని స్పష్టీకరణ
- ఈ ఏడాదిలోనే కుప్పం చివరి ఆయకట్టుకు హంద్రీనీవా జలాలు
- స్వర్ణ కుప్పం ప్రాజెక్టు కింద రూ. 1292 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం
- అభివృద్ధి ద్వారా వచ్చిన ఆదాయంతోనే సంక్షేమం అమలు చేస్తామన్న చంద్రబాబు
- విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:తన నియోజకవర్గమైన కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. బుధవారం నాడు కుప్పంలో పర్యటించిన ఆయన, 'స్వర్ణ కుప్పం' ప్రాజెక్టులో భాగంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో మాట్లాడుతూ, విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నామని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమై న హంద్రీనీవా నీళ్లను ఈ ఏడాదిలోనే అందిస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. రూ. 3,890 కోట్ల వ్యయంతో హంద్రీనీవా పనులను పూర్తి చేసి, నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు పారిస్తామని తెలిపారు. "అభివృద్ధి చేసే వారికే సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ఉంటుంది. అప్పులు తెచ్చి సంక్షేమం చేస్తామనడం సరైన పరిపాలన కాదు," అని ఆయన అన్నారు. అభివృద్ధి ద్వారా ఆదాయాన్ని

వివరాలు 2లో..

## బానిసగాబతకడం కన్నా జైలులోని చీకటి గదే మేలు



- పాక్ పాలకులపై మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్రస్థాయిలో ధ్వజం
- బానిసత్వం కంటే జైల్లో ఉండటానికే ఇష్టపడతానని వ్యాఖ్య
- జులై 6 నుంచి నిరసనలు చేపట్టాలని మద్దతుదారులకు పిలుపు
- 26వ రాజ్యాంగ సవరణ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిందని ఆరోపణ
- ఆర్మీ చీఫ్, న్యాయవ్యవస్థ పైనా తీవ్ర విమర్శలు చేసిన ఇమ్రాన్

వివరాలు 2లో..

## ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి.. రైతులకు అండగా నిలుస్తాం

- లక్ష వ్యవసాయ కుంటలను రైతులకు అందుబాటులోకి తెచ్చామన్న పవన్
- రైతుల సహకారంతోనే ఇది సాధ్యమయిందని ప్రశంస
- కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఫామ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు) నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు.

వివరాలు 2లో..

## చంద్రబాబును కాపాడాలి.. కేసీఆర్ ను తిట్టాలి.. ఇదే రేవంత్ రెడ్డి పని

- కేసీఆర్ ను తిట్టడమే రేవంత్ లక్ష్యమన్న గంగుల
- బనకచర్లపై పాత పాటే పాడారని ఎద్దేవా
- కేసీఆర్ గోదావరి జలాలు వాడుకోమని చెప్పడం బనకచర్లకు అనుమతి ఇచ్చినట్టు ఎలా అవుతుందని ప్రశ్న



పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఇచ్చిన పవర్ పా యింట్ ప్రజెంటేషన్ (పీపీపీ) ఒక ప్రహసనమని, అందులో కొత్తదనం ఏమీ లేదని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. కేవలం

వివరాలు 2లో..

## జగన్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన బైరెడ్డి శబరి



- చిల్లర రాజకీయాలతో పాదయాత్ర చేస్తే జనం చెప్పులతో కొడతారన్న శబరి
- వైసీపీ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తోందని తీవ్ర ఆరోపణలు
- కదిరిలో సీబీఐ దాడులపై వైసీపీ సమాధానం చెప్పాలన్న ఎమ్మెల్యే కందికుంట

వివరాలు 2లో..

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

- కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ తీర్పు
- గతేడాది దేశం విడిచి వెళ్లిన తర్వాత హసీనాకు ఇదే తొలి శిక్ష
- మానవ హననం కేసులోనూ తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న హసీనా

పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కేసులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆమెను దోషిగా తేల్చిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసీటీ), బుధవారం ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. దాదాపు ఏడాది క్రితం దేశంలో తీవ్ర నిరసనల మధ్య ఆమె ప్రభుత్వం కూలిపోయి, దేశం విడిచి వెళ్లిన తర్వాత ఒక కేసులో ఆమెకు శిక్ష పడటం ఇదే మొదటిసారి. ఢాకా ట్రిబ్యూన్ పత్రిక కథనం ప్రకారం, జస్టిస్ ఎండీ గోలాం మొర్తజా మొజుందర్

వివరాలు 2లో..



## హిమాచల్‌లో జల విలయం.. 51 మంది మృతి.. రెడ్ అలర్ట్ జారీ!

- హిమాచల్ ప్రదేశ్‌ను ముంచెత్తుతున్న భారీ వర్షాలు, వరదలు
- జూన్ 20 నుంచి ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయిన 51 మంది
- వరద సంబంధిత ఘటనల్లో మరో 22 మంది గల్లంతు
- ఉగ్రరూపం దాల్చిన బియాస్ నది, పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్
- మండీ జిల్లాలోనే అత్యధికంగా 10 మంది మృతి



పెన్ పవర్ డెస్క్:హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో అతలాకుతలమవుతోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న కుండపోత వానలకు జనజీవనం స్తంభించిపోయింది. ప్రకృతి సృష్టిస్తున్న ఈ బీభత్సానికి ఇప్పటివరకు 51 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 22 మంది గల్లంతయ్యారని అధికారులు అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో భారత వాతావరణ శాఖ (%×వీణ%) రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ ఎమర్జెన్సీ

వివరాలు 2లో..

## బీఆర్ఎస్ లో అంతర్గత పోరు ఉంది

- హరీశ్ రావును ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ పై పయ్యావుల కేశవ్ విమర్శలు
- ఉనికి కోసం హరీశ్ రావు బనకచర్ల గురించి మాట్లాడుతున్నారని వ్యాఖ్య
- అనవసర వివాదాలు సృష్టించవద్దని హితవు



పెన్ పవర్ డెస్క్:బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని బీఆర్ఎస్ కేవలం రాజకీయ లబ్ధి కోసమే తెరపైకి తెచ్చిందని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ లో నెలకొన్న అంతర్గత పోరులో భాగంగానే కొందరు నేతలు తమ ఉనికిని కాపాడుకోవడానికి ఈ వివాదాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. అనంతపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల

వివరాలు 2లో..

## విదేశాల్లో మెడికల్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయిస్తారా?

- వైద్య విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దంటూ ప్రభుత్వానికి జగన్ హెచ్చరిక
- విదేశీ వైద్య విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయించడం దారుణమని ఆగ్రహం
- పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపణ
- ప్రైవేట్ కాలేజీలకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వ కుట్ర అని వివరణ
- తాము తెచ్చిన మెడికల్ కాలేజీలను టీడీపీ అడ్డుకుంటోందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విదేశాల్లో వైద్య విద్యను పూర్తిచేసిన విద్యార్థుల పట్ల దారుణంగా వ్యవహరిస్తోందని, వారిపై పోలీసులతో దాడులు చేయించడం దుర్మార్గమని వైసీపీ అధినేత వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ఆయన

వివరాలు 2లో..

## ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా!

- సర్వీస్ ఉండగానే ఐపీఎస్‌కు గుడ్ బై చెప్పిన సిద్ధార్థ్ కౌశల్
- డీజీపీకి రాజీనామా లేఖ పంపిన ఐపీఎస్ అధికారి
- వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేశానని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ తన సర్వీసుకు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రెండు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో అందించిన సేవలకు ఆయన ముగింపు పలికారు. ఇది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని, ఎలాంటి ఒత్తిళ్లు లేవని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చాలాకాలంగా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నానని

వివరాలు 2లో..

## నేరాలు చేస్తే అమెరికా పౌరులైనా వదలం... దేశం దాటిస్తాం



పెన్ పవర్ డెస్క్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. తీవ్రమైన నేరాలకు పాల్పడే అమెరికా పౌరులను కూడా దేశం నుంచి బహిష్కరించాలనే కొత్త ఆలోచనను ఆయన తాజాగా బయటపెట్టారు. అయితే, ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లోరిడా ఎవర్గ్లేడ్స్‌లోని వలసదారుల నిర్బంధ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. అమెరికా

వివరాలు 2లో..

- తీవ్ర నేరాలకు పాల్పడే అమెరికా పౌరులను దేశం నుంచి బహిష్కరించాలని ట్రంప్ ప్రతిపాదన
- ఫ్లోరిడాలోని వలసదారుల నిర్బంధ కేంద్రంలో సంచలన వ్యాఖ్యలు
- దేశంలో పుట్టినవారికైనా, పౌరసత్వం పొందినవారికైనా ఇది వర్తిస్తుందని వ్యాఖ్య
- దీనిపై చట్టపరమైన స్పష్టత లేదని స్వయంగా అంగీకారం
- ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమని న్యాయ నిపుణుల హెచ్చరిక
- కొన్ని నేరాలకు పాల్పడిన సహజ పౌరుల పౌరసత్వం రద్దుకు ఇప్పటికే చర్యలు

ఎడిటర్ వ్యూ

# నిర్ణయం ఆలస్యమా? ‘

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారు. అయితే పార్టీ కేంద్ర నాయకత్వం మాత్రం ఇంకా రాజీనామాను ఆమోదించలేదు. రాజీనామా విషయంలోనిర్ణయం తీసుకునేందుకు మరికొంత సమయం తీసుకునే అవకాశముందని తెలిసింది. దీంతో పాటు రాజాసింగ్ ను ఖచ్చితంగా పార్టీ కేంద్ర నాయకత్వం వదులుకోదన్న వాదన కూడా వినపడుతుంది. కరడు గట్టిన హిందుత్వవాదిగా తెలంగాణలో అందరూ ఓడిపోయినా ఒకే ఒక్కడు బీజేపీ నుంచి గెలిచి చరిత్ర సృష్టించార. మూడు సార్ల నుంచి గెలిచిన రాజాసింగ్ ను పార్టీ అంత సులువుగా వదులుకోదన్నది పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. రాజాసింగ్ పై గతంలో సస్పెన్షన్ విధించినా తర్వాత ఎత్తివేసి పార్టీలోకి తీసుకున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు.

**ఆవేశంతో రాజీనామా చేశారని..**

పార్టీ అధ్యక్ష పదవికి తనను నామినేషన్ వేయనివ్వలేదని ఆయన తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపారు. అయితే రాష్ట్ర నాయకత్వం మాత్రం రాజాసింగ్ రాజీనామా లేఖను పార్టీ జాతీయ నాయకత్వానికి పంపింది. గోషామహల్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ తనకు పార్టీలో ప్రాధాన్యత లభించడం లేదని భావిస్తున్నారు. అందుకే ఆయన ఫ్రస్టేషన్ కు గురయి ఆవేశంగా రాజీనామా లేఖను సమర్పించి ఉండవచ్చని అంటున్నారు. కొంత సమయం ఇస్తే ఆయన కూడా సర్దుకుపోతారని భావించి నిర్ణయంలో కొంత సమయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

**ఖచ్చితంగా గెలిచే సీటును...**

ఖచ్చితంగా బీజేపీ ఖాతాలో పడే సీటు గోషామహల్. అక్కడ నుంచి గెలిచిన రాజాసింగ్ ను దూరం చేసుకుంటే మంచిది కాదని కేంద్ర నాయకత్వం కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇటు రాజాసింగ్ కూడా రాజీనామా చేసిన రోజు కంటే తర్వాత కొంత దిగి వచ్చినట్లే కనపడుతుంది. పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయం మేరకు నడచుకుంటానని ఆయన చెబుతున్నారు. పార్టీ జాతీయ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తనకు పరవాలేదని, తాను రాష్ట్రంలో ఏ పార్టీలోకి వెళ్లనని, తనకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సిద్ధాంతాలు పడవని చెబుతున్నారు. మహారాష్ట్ర రాజకీయాలకు వెళ్లిపోతానని అంటున్నారు. అక్కడ శివసేనలో చేరే అవకాశాలున్నాయని అంటున్నా రాజాసింగ్ పై చర్యలు ఉండబోవన్నది అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

# బీఆర్ఎస్ లో అంతర్గత పోరు ఉంది

- మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేస్తున్న విమర్శల వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని పయ్యావుల అన్నారు. “బీఆర్ఎస్ లో అంతర్గత సమస్యలు నడుస్తున్నాయి. అందులో భాగంగానే హరీశ్ రావు తన ఉనికిని చాటుకోవడానికి బనకచర్ల అంశాన్ని వాడుకుంటున్నారు. ఇది పూర్తిగా ఆయన సృష్టిస్తున్న రాజకీయ డ్రామా. మిగతా నేతలు కూడా ఆయన ట్రాప్‌లో పడి మాట్లాడుతున్నారు” అని పయ్యావుల వివరించారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్కడా స్పందించకపోవడాన్ని ఆయన ప్రస్తావిస్తూ, ఇది వారి అంతర్గత గొడవేనని స్పష్టం చేశారు.

బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి నష్టమూ వాటిల్లదని మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. “కిందకు వృథాగా పోయే నీటిని మాత్రమే వాడుకుంటున్నాం. దీనివల్ల ఎగువ రాష్ట్రాలకు ఏమాత్రం ఇబ్బంది ఉండదు. ఈ విషయం తెలిసి కూడా కేవలం రాజకీయ ఉద్దేశాలతోనే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారు” అని ఆయన అన్నారు.గతంలో తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను కూడా పయ్యావుల ఈ సందర్భంగా గుర్తుచేశారు. “రాయలసీమకు గోదావరి జలాలు రావాలని గతంలో కేసీఆర్ స్వయంగా చెప్పలేదా?” అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇప్పుడు ఆయన పార్టీ నేతలే అందుకు విరుద్ధంగా మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పయ్యావుల విమర్శించారు. అనవసర వివాదాలు సృష్టించి రెండు రాష్ట్రాల మధ్య అపోహలు పెంచవద్దని ఆయన హితవు పలికారు.

# ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా!

- మొదటి పేజీ తరువాయి

సిద్ధార్థ్ కౌశల్ తన ప్రకటనలో తెలిపారు. తన భవిష్యత్ జీవిత లక్ష్యాలకు, కుటుంబ సభ్యుల ఆకాంక్షలకు అనుగుణంగానే సర్వీసు నుంచి వైదొలగుతున్నట్లు వివరించారు. కొన్ని మీడియా మాధ్యమాల్లో వస్తున్నట్లుగా వేధింపులు లేదా బాహ్య ఒత్తిళ్ల కారణంగా తాను రాజీనామా చేశానన్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. “ఈ వార్తలు పూర్తిగా నిరాధారమైనవి, తప్పుదారి పట్టించేవి. నా నిర్ణయం పూర్తిగా స్వతంత్రమైనది, వ్యక్తిగతమైనది, స్వచ్ఛందమైనది” అని ఆయన స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నానని కౌశల్ పేర్కొన్నారు. “ఐపీఎస్ అధికారిగా పనిచేయడం నా జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన, విలువైన ప్రయాణం. నేను ఈ రాష్ట్రాన్ని ఎప్పుడూ నా సొంతిల్లుగానే భావించాను. ఇక్కడి ప్రజలు ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానంలో ఉంటారు” అని ఆయన అన్నారు. తన వృత్తి జీవితంలో తనకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, సీనియర్ అధికారులకు, సహోద్యోగులకు, సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. “మీ మద్దతు, విశ్వాసమే నన్ను ఒక అధికారిగా, వ్యక్తిగా తీర్చిదిద్దాయి” అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ కొత్త మార్గాల్లో సమాజానికి సేవ చేస్తానని సిద్ధార్థ్ కౌశల్ ఆశాభావం వ్యక్తం చేశారు. 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సిద్ధార్థ్ కౌశల్, గతంలో కృష్ణా, ప్రకాశం, వైస్సార్ కడప జిల్లాల ఎస్పీగా, రాష్ట్ర లా అండ్ ఆర్డర్ ఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన తన అధికారిక ప్రకటనలో భవిష్యత్ ప్రణాళికల గురించి ఏమీ ప్రస్తావించనప్పటికీ, ఢిల్లీ కేంద్రంగా ఒక కార్పొరేట్ సంస్థలో చేరవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు.

# బానిసగాబతకడం కన్నా జైలులోని చీకటి గదే మేలు

పాకిస్థాన్ పాలకులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, వారి బానిసత్వంలో మగ్గిపోవడం కంటే జైలులోని చీకటి గదిలో జీవించడానికే తాను ఇష్టపడతానని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జైలు జీవితం గడుపుతున్న ఆయన, ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన చట్ట సవరణలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నిరంకుశ పాలకులపై దేశవ్యాప్తంగా పోరాటం చేయాలని తన పార్టీ కార్యకర్తలకు, మద్దతుదారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా ఓ సందేశాన్ని విడుదల చేశారు. పాకిస్థాన్ ప్రభుత్వం ఇటీవల చేసిన 26వ రాజ్యాంగ సవరణ ప్రజాస్వామ్య మూలాలను దెబ్బతీసిందని ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. “ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు, చట్టబద్ధమైన పాలన, నైతిక విలువలు, మీడియా స్వేచ్ఛ అనేవి నాలుగు ముఖ్యమైన స్తంభాలు. కానీ తాజా సవరణ వీటన్నింటినీ నాశనం చేసింది. ఈ నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా జులై 6వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పోరాడాలని పాకిస్థాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పీటీఐ) కార్యకర్తలకు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను” అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తన సందేశాలు ప్రజలకు చేరకుండా అన్ని విధాలుగా అడ్డుకుంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పై కూడా ఇమ్రాన్ ఖాన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. “ఒక నియంత అధికారంలోకి వస్తే ఓట్లతో పని ఉండదు. తన ఇష్టానుసారం ప్రయోగాలు చేస్తూ పాలన సాగిస్తాడు” అని పరోక్షంగా విమర్శించారు. దేశ న్యాయవ్యవస్థపైనా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. న్యాయస్థానాల్లో ‘ఎంపిక చేసిన’ న్యాయమూర్తులే ఉన్నారని, స్వతంత్రంగా వ్యవహరించే వారికి శక్తి లేకుండా పోయిందని అన్నారు. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ కనుమరుగైందని, నిజాయతీగా పనిచేసే జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు.

# ఏడాది కాలంగా ఇదే మా పాలసీ

- మొదటి పేజీ తరువాయి

సృష్టించి, దానిని సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడమే సరైన ఆర్థిక విధానమని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం గత ఏడాదిగా ఇదే పాలసీని అనుసరిస్తోందని వివరించారు.

‘స్వర్ణ కుప్పం’ ప్రాజెక్టు కింద నియోజకవర్గంలో మొత్తం రూ. 1292 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే రూ. 125 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నియోజకవర్గంలోని రహదారులన్నింటినీ సీసీ, బీటీ రోడ్లుగా మార్చనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా గుంతలు లేని రహదారులను నిర్మించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతోనే ఏడాదిగా సుపరిపాలన అందిస్తున్నామని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా మహిళల కోసం ‘దీపం 2.0’ పథకాన్ని ప్రస్తావించారు. గతంలో తాము ప్రవేశపెట్టిన ‘దీపం’ పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందిస్తే, ఇప్పుడు ‘దీపం 2.0’ ద్వారా అర్హులైన మహిళలందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. దీనివల్ల కుప్పం నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలోనూ వంట గ్యాస్ అందుబాటులోకి వచ్చిందని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. సుపరిపాలనలో భాగంగానే ప్రజల ముందుకు వచ్చానని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

# నేరాలు చేస్తే అమెరికా పౌరులైనా వదలం... దేశం దాటిస్తాం

- మొదటి పేజీ తరువాయి

పౌరసత్వం పొందిన కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. “వారు మన దేశానికి కొత్త కాదు, చాలా కాలంగా ఇక్కడే ఉంటున్నారు. వారిలో చాలామంది ఇక్కడే పుట్టారు. నిజం చెప్పాలంటే, వాళ్లను కూడా ఇక్కడి నుంచి తరిమికొట్టాలని నేను భావిస్తున్నాను. బహుశా ఇదే మా తదుపరి పని కావచ్చు” అని ఏబీసీ న్యూస్ కథనం ప్రకారం ట్రంప్ వ్యాఖ్యానించారు.అయితే, తన ప్రతిపాదనకు చట్టపరమైన వెసులుబాటు ఉందో లేదో తనకు కచ్చితంగా తెలియదని ట్రంప్ అంగీకరించడం గమనార్హం. “చట్టపరంగా మాకు ఆ హక్కు ఉందో లేదో తెలుసుకోవాలి. ఒకవేళ ఆ అధికారం ఉంటే మాత్రం, ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఆ పని చేస్తాను. ప్రస్తుతం దానిపైనే మేం దృష్టి సారించాం” అని ఆయన స్పష్టం చేశారు.

ట్రంప్ వ్యాఖ్యలకు కొన్ని వారాల ముందే, ఆయన నియమించిన సహాయ అటార్నీ జనరల్ బ్రెట్ షుమేట్ ఒక మెమో జారీ చేశారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఉన్న కేసుల్లో పౌరసత్వం రద్దు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన యూఎస్ అటార్నీలను ప్రోత్సహించారు. ముఖ్యంగా వేధింపులు, యుద్ధ నేరాలు, మానవ అక్రమ రవాణా, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని లక్ష్యంగా చేసుకోవాలని ఆ మెమోలో పేర్కొన్నారు.

మరోవైపు, నేరాలకు పాల్పడ్డారనే కారణంతో, అమెరికా గడ్డపై సహజంగా జన్మించిన లేదా సహజ పౌరసత్వం పొందిన వారిని దేశం నుంచి బహిష్కరించడం రాజ్యాంగంలోని ఎనిమిదో సవరణను ఉల్లంఘించడమే అవుతుందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రూరమైన, అసాధారణ శిక్షలను ఈ సవరణ నిషేధిస్తుందని వారు గుర్తు చేస్తున్నారు.

వర్జీనియా యూనివర్సిటీకి చెందిన న్యాయశాస్త్ర ప్రొఫెసర్ అమండా ఫ్రాస్ట్ మాట్లాడుతూ, “పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసానికి పాల్పడటం లేదా దేశద్రోహం వంటి నిర్దిష్ట సందర్భాల్లో మాత్రమే సహజ పౌరుల హోదాను రద్దు చేయగలరు. అంతేకానీ, సంబంధం లేని నేరాలను కారణంగా చూపి ఒకరి పౌరసత్వాన్ని రద్దు చేసి, వారిని దేశం నుంచి బహిష్కరించడం కుదరదు” అని ఏబీసీ న్యూస్‌కు వివరించారు. ట్రంప్ సందర్శించిన ఈ నిర్బంధ కేంద్రాన్ని, కఠిన వలస విధానాల కారణంగా విమర్శకులు ‘అలిగేటర్ అల్కాట్రాజ్’ అని పిలుస్తుండగా, ట్రంప్ మాత్రం ఆ వివాదాన్ని పట్టించుకోకుండా తన పర్యటనను పూర్తి చేశారు.

# జగన్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన బైరెడ్డి శబరి

వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్.. వైసీపీ విధానాలపై, జగన్‌పై వేర్వేరు కార్యక్రమాల్లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలో నిర్వహించిన ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. “గడిచిన ఐదేళ్లలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలి. అది చేయకుండా చిల్లర రాజకీయాలతో పాదయాత్ర అంటూ వస్తే ప్రజలే చెప్పులతో కొడతారు” అని జగన్‌ను ఉద్దేశించి తీవ్రంగా హెచ్చరించారు.

జగన్ ఐదేళ్ల పాలనలో చేయలేని అభివృద్ధిని, తమ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే చేసి చూపించిందని శబరి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కూడా పాల్గొన్నారు.మరోవైపు, శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కూడా వైసీపీపై విమర్శలు చేశారు. స్థానికంగా జరిగిన ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కదిరిలో వైసీపీ నేతలపై జరుగుతున్న సీబీఐ దాడుల గురించి ప్రస్తావించారు. “దేశవ్యాప్తంగా 33 ప్రాంతాల్లో సీబీఐ సోదాలు చేస్తుంటే, అందులో కదిరి వైసీపీ నేతలు ఉండటం సిగ్గుచేటు” అని ఆయన ఎద్దేవా చేశారు.

# విదేశాల్లో మెడికల్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయిస్తారా?

- మొదటి పేజీ తరువాయి

స్పంది స్తూ, ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఇది దౌర్భాగ్యపు ప్రభుత్వం కాదా అని ప్రశ్నిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మండిపడ్డారు.

**పీఆర్ నంబర్ల జారీలో ఎందుకింత జాప్యం?**

విదేశాల్లో వైద్య విద్య పూర్తిచేసిన విద్యార్థులు, నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారం ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ (ఎఫ్ఎంజీ) పరీక్షలో ఉత్తీర్ణులై, రాష్ట్రంలోనే ఇంటర్న్‌షిప్ కూడా పూర్తిచేశారని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ, వారికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (పీఆర్) నంబర్ ఇవ్వకుండా ప్రభుత్వం ఎందుకు వేధిస్తోందని నిలదీశారు. ఇది కేవలం ఒక లాంఛనమే అయినా, దాన్ని కూడా పూర్తిచేయకుండా వారిని ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ వివక్షకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించినందుకు విద్యార్థులపై దాడులు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

**ప్రైవేట్ కాలేజీల కోసమే కుట్ర అని ఆరోపణ**

గత ఏడాది కాలంగా ప్రభుత్వం ఈ విద్యార్థుల పట్ల వివక్ష చూపుతోందని జగన్ ఆరోపించారు. ఇంటర్న్‌షిప్ పేరుతో వారిచేత వెట్టిచాకిరి చేయించుకుంటూ, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు లాభం చేకూర్చేందుకే ఉద్దేశపూర్వకంగా పీఆర్ నంబర్లు ఇవ్వడంలేదని విమర్శించారు. తల్లిదండ్రులు అప్పులు చేసి, ఆస్తులు అమ్మి పిల్లలను డాక్టర్లుగా చూడాలని విదేశాలకు పంపిస్తే, ప్రభుత్వం వారిని అంటరానివారిగా చూస్తూ కెరీర్‌ను నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది విద్యార్థులను నిరుత్సాహపరిచే కుట్రలో భాగమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

**మెడికల్ కాలేజీల అంశంపైనా విమర్శలు**

రాష్ట్ర విద్యార్థులు విదేశాలకు వెళ్లే అవసరం లేకుండా, తమ ప్రభుత్వం 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని జగన్ తెలిపారు. వాటి ద్వారా 2,550 సీట్లు అందుబాటులోకి తెచ్చే ప్రక్రియను ప్రారంభించి, ఐదు కాలేజీలను కూడా మొదలుపెట్టామని

గుర్తుచేశారు. మిగిలిన కాలేజీలు పూర్తిచేసే దశలో ఉండగా, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం వాటిని పూర్తిగా అడ్డుకుందని ఆరోపించారు. దేశ చరిత్రలోనే... కేంద్ర ప్రభుత్వం కేటాయించిన సీట్లను వద్దని చెప్పిన ఏకైక ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమని, పులివెందుల మెడికల్ కాలేజీకి కేటాయించిన సీట్లను కూడా వద్దంటూ ఎన్ఎంసీకి లేఖ రాశారని విమర్శించారు. అవినీతి, స్కామ్‌ల కోసం ప్రభుత్వ కాలేజీలను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు.

**తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్**

కష్టపడి చదివి వచ్చిన విద్యార్థులను అడిగినందుకు పోలీస్ స్టేషన్లలో పెట్టించడం దారుణమని జగన్ అన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ప్రభుత్వానికి ఇంత పగ ఎందుకని ప్రశ్నించారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన వారికి వెంటనే రిలీవింగ్ ఆర్డర్లు ఇచ్చి, ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్లను తక్షణమే జారీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

- మొదటి పేజీ తరువాయి

నేతృత్వంలోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్-1కు చెందిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ సంచలన తీర్పును వెలువరించింది. ఇదే కేసులో సంబంధం ఉన్న గైబంధా ప్రాంతానికి చెందిన షకీల్ ఆకంద్ బుల్బుల్‌కు కూడా రెండు నెలల జైలు శిక్ష విధించినట్లు ట్రైబ్యునల్ స్పష్టం చేసింది.షేక్ హసీనా ప్రస్తుతం కేవలం కోర్టు ధిక్కరణ కేసులోనే కాకుండా, అంతకంటే తీవ్రమైన ఆరోపణలను కూడా ఎదుర్కొంటున్నారు. గత ఏడాది తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన భారీ నిరసనల సమయంలో అమానవీయ రీతిలో నేరాలకు పాల్పడ్డారంటూ ఆమెపై అధికారికంగా అభియోగాలు నమోదయ్యాయి. నిరసనకారులపై షేక్ హసీనా ‘పద్ధతి ప్రకారం దాడులు’ చేయించారని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తాజుల్ ఇస్లాం ఆరోపించారు.ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదిక ప్రకారం, 2024 జూలై 15 నుంచి ఆగస్టు 15 మధ్య జరిగిన ఆ హింసాత్మక ఘటనల్లో సుమారు 1,400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. అయితే, తనపై మోపిన అన్ని ఆరోపణలను షేక్ హసీనా మొదటి నుంచి ఖండిస్తూ వస్తున్నారు. ఈ ఆరోపణలపై వాదనలు వినిపిస్తామని ఆమె తరఫు న్యాయవాది అమీర్ హుస్సేన్ మీడియాకు తెలిపారు.

# ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి.. రైతులకు అండగా నిలుస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఈ వ్యవసాయ కుంటలు కరవు పరిస్థితుల్లో కూడా రైతులకు ఆసరాగా నిలుస్తాయని పవన్ పేర్కొన్నారు. వీటి నిర్మాణం ద్వారా నిస్సారమైన భూములకు సైతం జీవం పోయవచ్చని, భూగర్భ జలాల మట్టం పెరగడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ ఫామ్ పాండ్స్ వల్ల ఇప్పటివరకు సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరిగిందని, అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ శ్రామికులకు పని కల్పించినట్టు అయిందని ఆయన తెలిపారు. రైతుల సహకారంతోనే ఈ బృహత్కార్యం సాధ్యమైందని పవన్ అన్నారు. వ్యవసాయ కుంటల ఆవశ్యకతను గ్రహించి, తమ పొలాల్లో వాటిని తవ్వించుకోవడానికి ముందుకు వచ్చిన రైతులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, ఈ యజ్ఞంలో పాలుపంచుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి మొదలుకొని క్షేత్రస్థాయి సహాయకుల వరకు సిబ్బందికి, ఉపాధి హామీ కూలీలకు ఆయన పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని పవన్ పేర్కొన్నారు. ఇందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు తెలియజేశారు.

# చంద్రబాబును కాపాడాలి.. కేసీఆర్ ను తిట్టాలి.. ఇదే రేవంత్ రెడ్డి పని

- మొదటి పేజీ తరువాయి

మాజీ ముఖ్యమంత్రి కేసీ ఆర్‌ను నిందించడం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కాపాడటమే రేవంత్ పని అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

బనకచర్ల ప్రాజెక్టుపై ప్రభుత్వం యుద్ధం ప్రకటిస్తుందని ఆశిస్తే, అందుకు భిన్నంగా పాత పాటనే పాడారని గంగుల ఎద్దేవా చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పేరుతో లక్షల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు. ఈ అంశంపై మాజీ మంత్రి హరీశ్ రావు వాస్తవాలను బయటపెట్టి, ప్రభుత్వాన్ని నిద్రలేపారని అన్నారు. అంతకుముందు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేవలం లేఖ రాయడంతోనే సరిపెట్టారని, సమస్య తీవ్రతను కేంద్రానికి వివరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. “ప్రభుత్వం వద్ద సరైన సమాచారం లేదు. ఎంతసేపూ రోజా రొయ్యల పులుసు గురించి మాట్లాడటం తప్ప రేవంత్, ఉత్తమ్‌లకు విషయంపై పట్టు లేదు” అని గంగుల వ్యాఖ్యానించారు. కేసీఆర్ గోదావరి జలాలు వాడుకోమని చెప్పడం బనకచర్లకు అనుమతి ఇచ్చినట్టు ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం వెంటనే అసెంబ్లీని సమావేశపరచాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, “వచ్చే సోమవారమే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలి. మా తరఫున హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి లేదా మరెవరైనా ప్రజెంటేషన్ ఇవ్వాలి” అని సవాల్ విసిరారు. బనకచర్లకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు నిరాకరించడం బీఆర్ఎస్ సాధించిన విజయమని, ప్రాజెక్టు పూర్తిగా ఆగిపోయే వరకు తమ పోరాటం కొనసాగుతుందని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కేసీఆర్‌ను దోషిగా నిలబెట్టాలని రేవంత్ రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఫలించవని పేర్కొన్నారు.ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, రేవంత్ రెడ్డికి బనకచర్ల ప్రాజెక్టు కన్నా కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకోవడమే ముఖ్యమైందని అన్నారు. గోదావరి ట్రిబ్యునల్ ద్వారా ఏపీకి అదనపు నీటి కేటాయింపులు సాధించుకునేందుకే చంద్రబాబు బనకచర్ల పథకానికి రూపకల్పన చేశారని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి ఎందుకు తీసుకెళ్లడం లేదని ఆయన నిలదీశారు. ఈ సమావేశంలో మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ తదితరులు పాల్గొన్నారు.

# హిమాచల్‌లో జల విలయం.. 51 మంది మృతి.. రెడ్ అలర్ట్ జారీ!

- మొదటి పేజీ తరువాయి

ఆపరేషన్ సెంటర్ ఈ విపత్తుపై ఒక నివేదికను విడుదల చేసింది. జూన్ 20 నుంచి జూలై 2వ తేదీ వరకు జరిగిన నష్టాన్ని ఈ నివేదికలో పొందుపరిచింది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటం వంటి వర్ష సంబంధిత ప్రమాదాల కారణంగా రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఈ మరణాలు సంభవించాయని తెలిపింది. ఈ ఘటనల్లో సుమారు 103 మంది గాయపడినట్లు నివేదిక వెల్లడించింది. అత్యధికంగా మండీ జిల్లాలో 10 మంది చనిపోయారని తెలిపింది.

భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని ప్రధాన నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా మండీ జిల్లాలో బియాస్ నది ఉప్పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. చండీగఢ్-మనాలీ జాతీయ రహదారిపై పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ముందుజాగ్రత్త చర్యగా మండీ, సిర్మౌర్ జిల్లాల్లో సుమారు 250కి పైగా రహదారులను అధికారులు మూసివేశారు. పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వరదల కారణంగా 614 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 130 మంచినీటి సరఫరా పథకాలు దెబ్బతిన్నాయని, దీంతో విద్యుత్, నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు ముమ్మరం చేశాయి.

# తొలి అడుగు
# ఇంటింటా సుపరిపాలన







**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 2**

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతోందనీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. ఈ సందర్భంగా పుల్లల చెరువు మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సెంటర్లో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుకు పార్టీ శ్రేణులు పూల మాలలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ వైసీపీ విధ్వంసం.. అరాచక పాలనకు స్వస్తి చెప్పాలంటూ టీడీపీ, జనసేన, బీజేపీ జట్టుకట్టి జనం మధ్యకు వెళ్లాయి. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకొని ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టింది. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు ద్వారా ఇంటింటా సంక్షేమం.. పల్లెపల్లెన ప్రగతి చేసి చూపిస్తాం అంటూ ప్రధాన హామీలు ఇచ్చి ఎన్నికల్లో ఘన విజయం సొంతం చేసుకుందని ఆయన గుర్తు చేశారు. ఏడాది పాలనలో వృద్ధులకు పింఛన్ 4 వేలకు పెంపు, తల్లికి వందనం, దీపం, మెగా డీఎస్సీ.. వంటి హామీలు ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. రైతులకు పెట్టుబడి సాయం చేసి అండగా నిలవాలని అన్నదాత సుఖీభవ పథకం అమలుకు కసరత్తు పూర్తయిందనీ, ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఏడాదిలో సాధించిన విజయాలు, సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తూ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఒకదాని తరువాత ఒకటి అమలు చేస్తూ, ప్రజల నమ్మకాన్ని గెలుచుకుంటున్నామని తెలిపారు. వైసీపీ పాలనలో ఉన్న భయాన్ని ఈ ప్రభుత్వం తొలగించిందని, ఇప్పుడు ప్రజలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జీవిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలకు కూటమి ప్రభుత్వం చేరువైందనీ అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. రాజకీయ కక్షలు, వేధింపులు, కేసులు లేకుండా సుపరిపాలనతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వైసీపీ పాలనలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఏ కేసు పెడతారో.. ఎప్పుడు అరెస్ట్ చేస్తారో అనే భయం అందరినీ వెంటాడిందనీ ఆయన అన్నారు. ఇప్పుడు అంతా పారదర్శకం. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి తెలుగుదేశం పార్టీ ఇంటింటా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందనీ అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకం అవుతూ,ఇంటింటికి వెళ్లిన ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలులో సమస్యలు ఉంటే వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన అన్నారు. విపక్షాలపై విమర్శల కంటే కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేయాలంటూ నాయకులను ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి అవ్వతాతలకు పెన్షన్ వస్తుందా అని, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలెండర్లు, రేషన్ కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు అందరికీ అందాయ అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కందుల వెంకటయ్య,మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల సీనియర్ నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగ నారాయణ రెడ్డి, ఎంపీటీసీ రాధా కృష్ణ,నీటి సంఘం అధ్యక్షుడు కొలుకులూరి కుమార్ స్వామీ, పట్టణ అధ్యక్షుడు అనీల్, మాజీ మండల కన్వీనర్ పల్లపాటి బాదరయ్య,మాజీ ఎంపీటీసీ ఇదేమ్మ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# పెన్ పవర్ ప్రకాశం

## పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలి

### వైకాపా ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ డిమాండ్



**కందుకూరు పెన్ పవర్, జూలై 2**

కరేడు వ్యవసాయ భూములను ఇండో సోలార్ కంపెనీకి 8500 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం బలవంత భూ సేకరణ చేస్తుందని దీనిని తక్షణమే ఆపాలని కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పత్రికా విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఇప్పటికే కరేడు పంచాయతీ పరిసరాలలో సుమారు 4000 ఎకరాలు భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది ప్రాథమికంగా పోయిన నెల 19వ తేదీన 940 ఎకరాలకు కరేడు గ్రామం మందలి భూములు అవసరమైనవి అని అందులో 165 కుటుంబాలు తొలగించాలని జీవో విడుదల చేశారు అని అన్నారు. కరేడు గ్రామపంచాయతీ రైతులు ఇంటి నివేశనదారులు ఎటువంటి పరిస్థితులలో భూములు యివ్వం అంటున్నారు అని అన్నారు. గ్రామ ప్రజలు భావనను అంగీకరించి ప్రభుత్వం భూసేకరణను విరమించుకోవాలి అని అన్నారు. కరేడు రైతులు పోరాటానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుంది. ఇండో సోలార్ ప్రాజెక్టుకు ఒప్పందం వరకు ఎన్ని ఎకరాల భూములు కావాలో ఆ ఒప్పందమును ప్రభుత్వం బయట పెట్టాలి అని డిమాండ్ చేశారు. రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూములు, వేరుశెనగ జామాయిలు కూరగాయలు మామిడి పచ్చని పంట పొలాలు సారవంతమైన భూములు తీసుకోకుండా ప్రభుత్వం పునరాలోచన చేయాలి అని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కరేడు రైతులకు అన్యాయం జరగనివ్వను అని బీరాలు పలుకుతున్నారు రైతుల భూములను ఎవరు సేకరిస్తున్నారు? రైతులకు ఎటువంటి ముందస్తు సమాచారం నోటీసులు ఇవ్వకుండా గ్రామ సభలు నిర్వహించకుండా రైతుల అభిప్రాయం సేకరించకుండా భూములు తీసుకోవడం బలవంత సేకరణ కాదా! అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతులు అభిప్రాయాన్ని గౌరవించి భూముల సేకరణను ఆపాలి అని అన్నారు. రైతులు మా భూములు అసలు ఇవ్వం అంటుంటే ఎమ్మెల్యే పరిహారం గురించి మాట్లాడటం హాస్యాస్పదం కాదా! అని అన్నారు. గత ప్రభుత్వం హయాంలోని సోలార్ ప్రాజెక్టు కోసం భూమిని కేటాయించటం దానికి సంబంధించి ఆ కంపెనీ డబ్బులు కూడా చెల్లించటం జరిగినది. భూమిని కేటాయించిన ప్రాంతంలోనే 20 ఎకరాలలో సోలార్ నిర్మాణాలకు కూడా మొదలుపెట్టినది అని అన్నారు. కరేడు గ్రామంలో దాదాపు 8500 ఎకరాలు సేకరిస్తామంటూ కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం విడ్డూరంగా ఉంది. చేవూరు రావూరు పొలం 100 ఎకరాలు మాత్రమే ఇచ్చి బీపీసీఎల్ కి భూములు కావాలనే ఉద్దేశంతో హిందూ సోలార్ను కరేడు ప్రాంతానికి తరలిస్తున్నారు అని అన్నారు. ఇలా పంపించి రైతుల్లో ప్రజల్లో అలజడి రేకెత్తిస్తున్నారు అని అన్నారు. రైతు ఉద్యమ సందర్భంగా రైతులు మీద బనాయించిన కేసులను తక్షణమే ఎత్తివేయాలి అని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పేరు తోటి రైతులను ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు అని అన్నారు. షిరిడి సాయి కి ఇదివరకే భూములు కేటాయించారు వారికి కేటాయించిన భూములు వారికే ఇవ్వాలని మిగిలిన పరిశ్రమలకు న్యాయబద్ధంగా చట్టబద్ధంగా చాలా చోట్ల భూములు ఉన్నాయి అక్కడ కేటాయించాలని కోరుతున్నాము. మత్స్యకారుల జీవనోపాధి కూడా కోల్పోయే పరిస్థితి వస్తుంది. కాలుష్యం వలన మత్స్య సంపద అంతరిస్తుంది అని అన్నారు. విలేకరులవిలేకరుల సమావేశంలో చేవూరి శ్రీనివాసులు, ఎంపీటీసీ పోకూరి వినయ్, ఎంపీటీసీ 2 ఏ వెంకట రమణయ్య కరేడు రైతులు బందుల సుందరరామిరెడ్డి, బొమ్మిరెడ్డి శరభారెడ్డి, మేకన పోయిన చెంచయ్య, రామాల కృష్ణారెడ్డి, బొమ్మిరెడ్డి పవన్ కుమార్ రెడ్డి, దగ్గుమాటి సుబ్బరామిరెడ్డి (కరేడు గ్రామ పార్టీ అధ్యక్షులు ) జి చిన్న నాంచార్లు, పి భాస్కర్ కరేటి కోటేశ్వరరావు, బొడ్డు శ్రీధర్ రెడ్డి, తెల్లపాటి కృష్ణ, చినిగే శ్రీనివాసులు, ఆలుచూరి రవీంద్రారెడ్డి మండల అధ్యక్షులు నన్నెం పోతురాజు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, నలమోతు చంద్రమౌళి, చీమల వెంకట రాజా, అప్పనబోయిన రాజేష్. బిల్లా రమణయ్య, దగ్గుమాటి కోటయ్య, కాపులూరిమదుసూధన్, తాటిపర్తి. రమేష్,విగ్నేష్, అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

# రేపు మార్కాపురానికి డిప్యూటీ సీఎం పవన్ రాక

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ తమిమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ జనసేన పార్టీ ఇన్చార్జి కాశీనాథ్

### పర్యటనకు ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయండి: కలెక్టర్

**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ జులై 2**

ఈ నెల 4వ తేదీన(రేపు) డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జిల్లాకు రానున్నారని, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ తమిమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మార్కాపురం లో జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా 1290 కోట్ల రూపాయలతో చేపట్టనున్న తాగునీటి పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి బుధవారం స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తో కలిసి కలెక్టర్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు, భద్రత గురించి పోలీస్ అధికారులతో చర్చించారు. సుమారు సభకు పదివేల మంది వరకు హాజరు కానున్నారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు. హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలు,సభా వేదిక వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేపట్టడంతో పాటు క్రౌడ్ మేనేజ్మెంట్ ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని పోలీస్ శాఖ కు తెలిపారు. స్టేజీ, బారికేడ్లు తదితర ఏర్పాట్ల గురించి ఆర్అండ్‌బీ అధికారులకు పలు సూచనలు చేశారు. పారిశుధ్యం పనులు, టాయిలెట్స్, శిలాఫలకం ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, సౌండ్ సిస్టమ్, తదితర ఏర్పాట్లు చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రొటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని, గురువారం సాయంత్రానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద తీసుకోవాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, మార్కాపురం డి ఎస్ పి నాగరాజు, జన సేన పార్టీ మార్కాపురం నియోజకవర్గం ఇంచార్జి ఇమ్మడి కాశినాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.















## "అఖండ జ్యోతి" వెలిగించిన సానికొమ్ము రంగనాయకులురెడ్డి పద్మావతి దంపతులు



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జూలై 2**

పట్టణంలోని ప్రముఖ ఆలయం శ్రీషిరిడి సాయిబాబా దేవస్థానంలో బుధవారం అఖండ సాయినామ సప్తహము, గురు పౌర్ణమి మహోత్సవం సందర్భంగా సానికొమ్ము రంగనాయకులురెడ్డి పద్మావతి దంపతులు ఉదయం 7 గం"లకు "అఖండ జ్యోతి" వెలిగించి అనంతరం తమ్ముడు సానికొమ్ము రామమనోహర్ రెడ్డి పద్మ దంపతులతో కలిసి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో అఖండ సాయి నామ సప్తాహము 7 రోజులు నిరంతరం (రాత్రి, పగలు) నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పురపు సత్యాలు తెలిపారు. అఖండ సాయి నామ సప్తః, గురు పౌర్ణమి మహోత్సవాలను పురస్కరించుకుని ధనేంకుల తిరుమలరావు తిరుపాలమ్మ దంపతులు భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ నిర్వహించారు.

## బీఎస్పీ జిల్లా అధ్యక్షులుగా ఒంగోలు చిట్టిబాబు



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూలై 02**

ప్రకాశం జిల్లా బహుజన సమాజ్ వాది పార్టీ ప్రకాశం అధ్యక్షులుగా ఒంగోలు చిట్టిబాబు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి గౌతమ్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక భాగ్యనగర్ లోని బీఎస్పీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వేల్పుల తిరుమల కృష్ణ యాదవ్, సలహాదారులుగా పి గురవయ్య, ఆర్ కొండయ్య, జిల్లా ఇన్చార్జిగా జడ ప్రసాద్ తో పాటు ఐదుగురు సభ్యులతో జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఒంగోలు చిట్టి బాబు మాట్లాడుతూ భారతదేశంలో నేటి పరిపాలనలో ఉన్న బిజెపి కాంగ్రెస్ పార్టీ లకు వ్యతిరేకంగా పోరాటం చేసేది ఒక్క బీఎస్పీ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు వసంత్, ఆంజనేయులు కాలేషా తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 2**

సిఎస్పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు జె పోతురాజు, జి లక్ష్మణ్ కుమార్, ఎన్ దివ్యభారతి, షేక్ రజియా, బి చిన్న నారాయణ, ఎం సుభాషిని, ఓ ఓలేశ్వరరావు, జి వేమన్నారాయణ, ఎస్పీ రాధాకృష్ణసూరి, జే వెంకటేశ్వర్లు, టీ వంశీకృష్ణ బదిలీపై వెళ్తున్న సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నిసా బేగం ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది విద్యా సేవలను గుర్తు చేసుకుంటూ వారికి పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయులు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సేవలు చిరస్మరణీయమని ప్రశంసించారు. ఈ పాఠశాలలో పని చేసిన కాలంలో విద్యార్థులలో చదువుపై ఆసక్తి పెంచడానికి, పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకుంటూ, బదిలీపై వెళ్తున్న పాఠశాలలో కూడా ఇదే విధముగా విధులను నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ హుస్సేన్ బీ, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ల కు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను ఇస్తే జైలుకే గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్

**గిద్దలూరు పెన్ పవర్ జులై 2**



పాఠశాలలు, కళాశాలలు వెళ్లే పిల్లలకు తల్లితండ్రులు ద్విచక్ర వాహనాలు ఇచ్చి పంపిస్తే కఠిన చర్యలు తప్పవని గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ హెచ్చరించారు. బుధవారం రోడ్డు ప్రమాదాలపై సీఐ మాట్లాడారు. తల్లితండ్రులు తమ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని ఇటీవల ముండ్లపాడు గ్రామంలో ముగ్గురు మైనర్లు వాహనం నడిపి ఓ వ్యక్తి ప్రాణం పోయేందుకు కారణమయ్యారన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా, జైలు శిక్ష తప్పదు అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు.

### కొమరోలు లో 4వ తేదీ నుంచి

# మొహరం సరిగేసులు ప్రారంభం

### 6వ తేదీ పెద్ద సరిగేసు -7వ తేదీ (షహదత్ )పీర్లను స్నానానికి తరలింపు కార్యక్రమం నిర్వహణ







**కొమరోలు పెన్ పవర్ జూలై 2**

కొమరోలు మండలంలోని పలు గ్రామాలలో ఈ నెల 4వ తేదీ నుంచి మొహరం పర్వదిన సరిగేసులను నిర్వహించేందుకు ముజావర్లు నిర్ణయించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఈ నెల ఆరవ తేదీ ఆదివారం మొహరం పర్వదిన ముగింపు వేడుకలను నిర్వహించవలసి ఉన్నది .అయితే 6వ తేదీన హిందువులకు ముఖ్యమైన తొలి ఏకాదశి పర్వదినం కావడంతో మొహరం వేడుకల ముగింపు కార్యక్రమాన్ని ఏడవ తేదీకి మార్పు చేయవలసి వచ్చిందని ముజావర్లు ప్రకటించారు .ఆ మేరకు కొమరోలు లోని రెండు పీర్ల చావిడిలలో చిన్న సరిగేసు ఈ నెల4వ తేదీన, పగలు సరిగేసు ఐదవ తేదీన ,పెద్ద సరిగేసు ఆరవ తేదీన నిర్వహించి ఏడవ తేదీన పీర్లను స్నానానికి తరలించే (షహదత్) కార్యక్రమాలను నిర్వహించనున్నట్లుగా కొమరోలు ముజావర్లు తెలిపారు .చిన్న సరికేసు రోజున పీర్ల ముందు ఏర్పాటు చేసిన గుండాన్ని వెలిగిస్తారని ,పెద్ద సరిగా రోజున పెద్ద ఎత్తున కలప దుంగలను గుండాలకు తరలించి నిప్పు పెడతారు. అదేరోజు సాయంత్రం నుంచి పీర్ల చావిడులలో జరిగే ఫాతెహా కార్యక్రమాలకు భక్తులు కుల మతాలకు అతీతంగా అధిక సంఖ్యలో హాజరై తమ మొక్కులను తీర్చుకుంటారని వారు తెలిపారు. ఆ సందర్భంగా భక్తులు తీర్థప్రసాదాలను అగ్నిగుండంలో వేసి అన్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రార్థిస్తారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అలంకరించిన పీర్లను వీధులలో ఊరేగించి ఏడవ తేదీ ఉదయం 8 గంటలకు తిరిగి పీర్ల చావిడులకప చేరుస్తారు. అదేరోజు సాయంత్రం 4:00 నుంచి పీర్లను వెలికి తీసి మేళ తాళాలు, తప్పెట్లతో ఊరేగింపు నిర్వహించి అనంతరం స్నానానికి తరలిస్తారు . ఆ సందర్భంగా పీర్ల సావిడిల ముందు గల అగ్ని గుండంలోని నిప్పు కణాలపై యువకులు, భక్తులు నడిచి తమ భక్తిని చాటుకుంటారు. ఈ కార్యక్రమాలకు కుల మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని మొహరం వేడుకలను జయప్రదం చేయాలని ముజావర్లు కోరారు.

# రైతులు ఫసల్ భీమా యోజనలో పంట నమోదు చేసుకోవాలి

### మండల విస్తరణాధికారి పి శ్రీనివాసులు





**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 2**

ఖరీఫ్ 2025 ప్రకాశం జిల్లాలో ఫసల్ భీమా యోజన పథకానికి సంబంధించి నోటిఫ్డి పంటలు అయిన వరి, కంది, సజ్జ,ఎండు మిరప, నువ్వులు,ప్రత్తి పంటలు లు వేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో నమోదు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి పి. శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వెంకటాయచెరువు మరియు సి ఎస్ పురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంను నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ 2025 లో ప్రకాశం జిల్లాలో నోటిఫ్డి పంటలుగా వరి, కంది, సజ్జ, ఎండు మిరప, నువ్వులు, పత్తి పంటలు ఎంపిక కాబడినవని తెలిపారు వరి పంటకి ఎకరాకి 860/-,కంది పంటకి 430/- సజ్జ పంటకి 156/-ఎండు మిరప 4500/- నువ్వులు 180/- ప్రత్తి పంటకి 2100/- రూపాయలు ఎకరానికి చెల్లించాలని తెలిపారు ప్రీమియం చెల్లించే రైతులు మీ సమీపంలోని రైతు సేవా కేంద్రం లోని వ్యవసాయ మరియు ఉద్యాన సహాయకుల వద్ద పంట సాగు పత్రం తీసుకోవాలని, ఆధార్ కార్డు,పట్టాదారు పాసు పుస్తకం,బ్యాంకు పాసు పుస్తకం జెరాక్స్, ఆధార్ లింక్ ఉన్న ఫోన్ నెంబర్ తీసుకొని సిఎస్సి సెంటర్ కి వెళ్లి ప్రీమియం చెల్లించాలని తెలిపారు రసాయన ఎరువులు వాడకాని తగ్గించి సేంద్రియ ఎరువులు ఉపయోగించాలని,భూసారా పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు ఉపయోగించాలని, కౌలు రైతు కార్డుల వలన ప్రయోజనాల గురించి,పచ్చి రొట్ట విత్తనాలు సాగు చేయడం వలన ఉపయోగాలను గురించి రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంల గ్రామ వ్యవసాయ సహాయకులు పి. రవి,జి. రామశారద మరియు ఆయా గ్రామాలలోని రైతులు పాల్గొన్నారు.

## అక్రమ రిజిస్ట్రేషన్ కు పాల్పడిన ఏడుగురు వ్యక్తులు అరెస్టు

### - డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్- 14 మందిపై కేసు నమోదు

### - అక్రమ, భూ కబ్జాలు పాల్పడితే కఠిన చర్యలు

**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జూలై 2**



నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ కు పాల్పడిన ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు కనిగిరి డీఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ మాట్లాడుతూ కనిగిరి పట్టణంలోని శంఖవరం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 301,302 లో మొత్తం 14 మంది కలిసి కుట్రపన్ని అక్రమంగా విలువైన స్థలమును కాజేయాలని ఉద్దేశంతో నకిలీ పత్రాలను సృష్టించి, సుమారు 0.95 సెంట్లు (సుమారు 15 కోట్లు) విలువ గల స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి, తద్వారా ఆ స్థలాన్ని అమ్ముకొని అక్రమ లాభం పొందాలని పన్నాగం పొందినారు. ఈక్రమంలో ఆ స్థలం యజమాని అయిన పోలంరెడ్డి మాలకొండారెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన రిపోర్ట్ మేరకు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. కనిగిరి సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా సరే అక్రమంగా ప్రభుత్వ భూమిని లేదా ప్రైవేట్ భూమిని గాని ఆక్రమించినా, నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్టర్ చేయించుకున్నా, విక్రయ అగ్రిమెంట్ చేసినా, పెద్దలు అమ్ముకున్న ఆస్తులను వారి వారసులు గాని, వాళ్ల వారసులు దగ్గర హక్కు లేకపోయినా కొనిన, కొన్నామని చెప్పి భూమి కబ్జా చేసినా, ఇతరులను ఇబ్బంది పెట్టిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని, వారు శిక్ష అర్హులు అవుతారని తెలిపారు. స్థలాలు, భూములు కొనే వాళ్ళు కూడా సక్రమంగా అన్ని విధాలుగా స్థలం గాని, పొలములకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా ఒకటికి రెండు సార్లు పరిశీలించి, తెలిసిన వారి వద్ద విచారించుకొని కొనుగోలు చేయవలెను. తల్లిదండ్రులు అమ్మివేసిన స్థలమును మళ్లీ వారి వారసులు ఇప్పుడు మాకు హక్కు ఉన్నదని తప్పుడు ఆలోచనలతో పత్రాలు సృష్టించి లేదా దానికి సహకరించిన వారసులపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. స్థలాలు కొని, అమ్మే బ్రోకర్లు కూడా చట్టపరమైన మార్గాల ద్వారా స్థలాలను కొనడం/అమ్మడం జరగాలి లేదా తప్పుడు పనులు చేస్తే బ్రోకర్లను కూడా అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించడమైనది. ఈ నకిలీ పత్రాలు సృష్టించిన గవర్నమెంట్ అధికారుల యొక్క తప్పుడు స్టాంపులు తయారు చేసే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈకేసును చేధించిన కనిగిరి డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్, కనిగిరి సీఐ షేక్ ఖజావలి, కనిగిరిఎస్సై టి శ్రీరామ్, హనుమంతునిపాడు కె మాధవరావు మరియు సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

## మానవత్వం చాటుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ జులై 2**

గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట సమీపంలో ద్విచక్ర వాహనదారుడు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలయ్యాదు. అదే సమయంలో నంద్యాల వైపు నుంచి గిద్దలూరు వైపు వస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి జరిగిన ప్రమాదాన్ని గమనించి తనకాన్వాయి ని ఆపి క్షతగాత్రుని వద్దకు వెళ్లి వెంటనే తన వాహనంలో గిద్దలూరు ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే ఔదార్యానికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగ పరుచుకోవాలి

### మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి



**పొదిలి, పెన్ పవర్, జూలై 2**

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోరారు బుధవారం నాడు మండలంలోని ఆముదాలపల్లి మరియు అన్నవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి ఆయా గ్రామాల్లోని రైతులతో సమావేశం జరిపారు ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కి సాగు చేసే రైతులు అవసరమైన విత్తనాలు 50 శాతం రాయితీపై రైతులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు అందుకు సంబంధించి రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకుని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలని ఆయన సూచించారు అలాగే రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు మండల ఉద్యానవన శాఖ అధికారి బి ధనలక్ష్మి మాట్లాడుతూ ఉద్యానవన శాఖ లో అమలు జరుగుతున్న వివిధ పథకాల గురించి రైతులకు తెలియజేశారు అనంతరం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందును రైతులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు బి నర్మద, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు సుపరిపాలనలో సంతోషంగా ప్రజలు - ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 02**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఏడాది పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఒంగోలు శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ రావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని 5, 6 డివిజన్లలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేవా అని వాకబు చేశారు. ఏడాది కాలంలోనే పున:ప్రారంభించిన అన్న క్యాంటిన్లు, కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి అందిస్తున్న తల్లికి వందనం పథకం, ఉచిత మూడు గ్యాస్ సిలిండర్లు,రూ. మూడు వేల నుండి నాలుగు వేల రూపాయల కు పెంచిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలతో ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ముందుకు సాగుతుందని అన్నారు. సూపర్ సిక్స్ లో పేర్కొన్న పథకాల అమలు ఒక్కొక్కటిగా చేసుకుంటూ అధికార కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని దామచర్ల జనార్ధన్ పేర్కొన్నారు. ఒంగోలు నగరంలో భూ కబ్జాదారులకు, భూ అక్రమార్కులకు అవకాశం లేకుండా సుపరిపాలన అందిస్తున్నామని ఏడాది కాలంలోనే ఒంగోలు నగరంలో 100 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండారు మదన్, క్లస్టర్ ఇంచార్జ్ దాచర్ల వెంకటరమణయ్య, 5, 6వ డివిజన్ అధ్యక్షులు ఆవుల శ్రీనివాస్ యాదవ్, పసుపులేటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## బి సి సహాయ సంక్షేమాధికారికి వీడ్కోలు సన్మానం




**గిద్దలూరు పెన్ పవర్ జులై 2**

గిద్దలూరు బిసి సంక్షేమాధికారి శీలం సుబ్బారావు కు గిద్దలూరు సబ్ డివిజన్ వసతి గృహ సంక్షేమాధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. శీలం సుబ్బారావు గిద్దలూరులో బి సి సహాయ సంక్షేమాధికారిగా పనిచేస్తూ జూన్ 30 న పదవి విరమణ చేశారు . ఈ సందర్భాన్ని పురస్కరించుకొని హెచ్ డబ్ల్యూ ఓ లు బుధవారం బి సి బాలికల వసతి గృహంలో సన్మాన సభ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సుబ్బారావు ఏ బి సి డబ్ల్యూ గా 34 సంవత్సరాలు పనిచేసి తన విద్యుక్తధర్మాని ఈనాడు విడనాడలేదని . తన పరిధిలోని ఎచ్ డబ్ల్యూ ఓ లను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయక అందరి మన్ననలు పొందారన్నారు. క్రింది స్థాయి ఉద్యోగులకు వారధిగా తన సహకరించారన్నారు. తన సర్వీస్ కాలంలో ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేశారన్నారు. వసతి గృహాల్లో నివసించే పిల్లల కు అందించే వసతులు, మెనూ ప్రకారం భోజనం కల్పించేందుకు ఏకీభవించేవారుకాదని , తమను కూడా అందుకు ప్రోత్సహించేవారని పేర్కొన్నారు. కార్యాలయం లో తమ సమస్యలను ఎప్పటి కప్పుడు తెలుసుకొని పరిస్కరించేవారని . సర్వీస్ మ్యాటర్స్లో అందరికన్నా ముందుండి పరిష్కరించే వారన్నారు, ఉద్యోగభాద్యతలను సక్రమంగా నిర్వహించే వారికి సత్కారాలు ,సన్మానాలు వాటంతట అవే దరిచేరతాయని పేర్కొన్నారు . సుబ్బరావు కు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి సుఖ శాంతులతో ఉండాలని , తమ ఇక్కడి సేవలను చిరకాలం జ్ఞాపకం పెట్టుకుంటామని పేర్కొన్నారు అనంతరం సుబ్బారావు ను దుశ్శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఏ బి సి డబ్ల్యూ ఖాసీం వసతి గృహాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టాక్సీ డ్రైవర్ నూతన కార్యవర్గం ఎన్నిక

**పామూరు, పెన్ పవర్,జూలై02**

ది పామూరు టాక్సీ డ్రైవర్ యూనియన్ పట్టణంలోని పప్పు వెంకోబారావు మీటింగ్ హాల్ లో రెండవ మహాసభలలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ది పామూరు టాక్సీ డ్రైవర్ యూనియన్ అధ్యక్షులుగా షేక్ నాయబ్ రసూల్ (బుజ్జి) కార్యదర్శిగా దిండు సత్యనారాయణ, ట్రెజరర్ గా పటాన్ జిలాని, ఉపాధ్యక్షులుగా కొండయ్య, సహాయ కార్యదర్శిగా పంగా ఆంజనేయులు కమిటీ సభ్యులు 8 మందిని 13 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అనంతరం మహాసభలో తీర్మానాలు నాలుగు చక్రాల పేరుతో 1. సంక్షేమ పథకాలను అమలు చేయాలని, 2. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, 3. డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, 4. అన్ని పెనాల్టీలను (జరిమానాలను) రద్దు చేయాలని తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే. మాల్యాద్రి, షేక్. హుస్సేన్ భాష, కాలేశా, నాయిబ్ రసూల్ రవి, శివాజీ, నాగేంద్రం బుజ్జి, టాక్సీ డ్రైవర్ లు తదితరులు పాల్గొన్నారు.



# అల్పపీడనం ద్రోని ప్రభావంతో కురుస్తున్న తేలికపాటి జల్లులు

### చల్లబడిన వాతావరణంతో ఊరట చెందుతున్న ప్రజలు.

### భారీ వర్షాలు కురుస్తాయని ఆశతో ఎదురు చూస్తున్న రైతాంగం.




**కొమరోలు పెన్ పవర్ జూలై 2**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోని ప్రభావంతో మంగళవారం సాయంత్రం నుంచి తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. బుధవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఒక మోస్తరు వర్షం కురిసింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ వర్షాలు ఆచూకీ లేకపోగా ఒక మోసరు ఎండలు కాస్తున్నాయి. ఉక్కపోత కూడా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ వచ్చింది. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ధోని ప్రభావంతో గత రెండు రోజులుగా చిరుజల్లు కురుస్తున్నాయి. సిమెంట్ రోడ్లపై నీరు ప్రవహిస్తుండగా, లోతట్టు లో ఉన్న సిమెంట్ రోడ్లపై వర్షపు నీరు నిలిచి ప్రజల రాకపోకలకు కలిగిస్తున్నది. ఏప్రిల్ మాసం లో 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది ఇక మే, జూన్ మాసాలలో వర్షపు జాడ కనుచూపుమేరలో కనిపించలేదు. అయితే గత రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి జల్లుల వలన తమకు ఎలాంటి ప్రయోజనం లేదని రైతుల తెలుపుతున్నారు. భారీ వర్షాలు కురిసి చెరువులు, వాగులు, వంకలు నిండి పొలాలు పదునెక్కితే తప్ప పంటల సాగుకు వాతావరణం అనుకూలించదని రైతులు చెబుతున్నారు .తేలికపాటి వర్షాలతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు కొంత ఊరట చెందుతున్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఇంటింటికీ పంచిపెట్టిన ముత్తుముల సంజీవరెడ్డి, తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు.

### రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్య క్రమాలను వివరిస్తున్న నేతలు.

### సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేర్చాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయం.



**కొమరోలు పెన్ పవర్ జూలై 2.**

రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలన దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ముద్రించి సరఫరా చేసిన సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను కొమరోలు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో రెండవ తేదీ బుధవారం తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు ఇంటింటికి పంపిణీ చేశారు. కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ,మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి ,కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొనేని వెంకటేశ్వర్లు యాదవ్, కొమరోలు మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ ఖాదర్ ,గిద్దలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ హసీనా , తదితర నేతల ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కొమరోలు పట్టణం తో పాటు కొమరోలు పంచాయతీలోని గోపానిపల్లె హనుమంతురాయనిపల్లె , సరివిరెడ్డి పల్లె ,పురుషోత్తముని పల్లె దితర గ్రామాలలో ఆయా గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు, వార్డు మెంబర్లు ఇంటింటి కి సాగించి కరపత్రాలు పంచిపెట్టారు. కొమరోలు పట్టణంలో మాజీ ఎంపిటిసి సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి ,వార్డ్ మెంబర్ షేక్ సుభాని తదితర నేతలు కార్యకర్తలు బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి ఇంటింటికి కరపత్రాలు పంచే కార్యక్రమాన్ని చేపట్టారు .ఆ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ,జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తదితర నేతలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నింటిని ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచి అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి 15వేల రూపాయలు చొప్పున అందిస్తున్నారని ,అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని ఆయన తెలిపారు. సామాజిక పెన్షన్ల మొత్తాన్ని భారీగా పెంచి పంపిణీ చేస్తున్నారని ,అలాగే రాష్ట్రంలో 204 అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. మిగిలిన హామీలన్నింటినీ దశలవారీగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన వివరించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు పట్టణ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బిన్నీ భాష ,నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో ఆయా పంచాయతీలలోని వార్డు మెంబర్లు ,పంచాయతీ ,వార్డుల ఇన్చార్జీలు ,పార్టీ కార్యకర్తలు పాల్గొని కరపత్రాలను ఇంటింటికి పంచారు.



## చిన్న దోర్నాల చిన్న గుడిపాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది




**పెద్ద దోర్నాల పెన్ పవర్ జూలై 2**

మండల పరిధిలోని చిన్న దోర్నాల చిన్నగుడిపాడు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి డి జవహర్ లాల్ నాయక్ అధ్యక్షతన బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సహాయ వ్యవసాయ సంచాలకులు యర్రగొండపాలెం ఈ. వెంకటరమణ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే పథకాలతో పాటుగా రైతులకు పంటల సాగు విధానము ప్రత్యామ్నాయ పంటల గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి డి జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈఓ చైతన్యకుమార్ బి ఏ ఏ లు రాజేంద్రప్రసాద్ హరిజన నాయక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నోటి జబ్బు వ్యాధికి ముందస్తు టీకాలు తప్పని సరి



**వలేటివారిపాలెం పెన్ పవర్ జూలై 2**

సన్న జీవాలకు సీజన్ లో వచ్చే నోటి జబ్బులకు ముందస్తు టీకాలు వేయించాలని ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. బుధవారం శామీర్ పాలెం గ్రామంలో సర్పంచ్ నవులూరి రాజా రమేష్ ఆద్వర్యంలో ఉచిత నట్టల నివారణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా పశు వైద్యాశాల సహయ సంచాలకులు డాక్టర్ ఇ. చెన్నకేశవులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా సంవత్సరములో రెండు సార్లు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తారని సన్న జీవాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొర్రెలు, మేకలకు నాలుగు సార్లు డీవార్మింగ్ మందులు తాపించడం వలన గొర్రెలు ఆరోగ్యం గా ఉండి త్వరగా చూడు కట్టడం ఆరోగ్యం గా ఉండే పిల్లలు పుడుతాయని తెలియజేశారు. ప్రస్తుతం మండలంలోని అన్నీ గ్రామాల్లోని సన్న జీవాలకు నోటి జబ్బు (నీలి నాలుక ) వ్యాధికి ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని సన్న జీవాల రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో పోకూరు పశు వైద్యులు డాక్టర్ యస్. సుధాకర్ శామీర్ పాలెం రైతు సేవా కేంద్రం పశు వైద్య సహాయకులు డి. చౌడయ్య మరియు రైతులు పాల్గొన్నారు.

## కనిగిరిలో ప్రారంభమైన ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



**కనిగిరి ఆర్సీఇంచార్జ్ పెన్ పవర్ జూలై 2**

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమం కనిగిరిలో బుధవారం విజయవంతంగా నిర్వహించబడింది. రాష్ట్ర కౌన్సిలర్ పి. రాజ్ కుమార్, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పి. రాజ్ కుమార్ మాట్లాడుతూ "ఏపీటీఎఫ్ ఒక ఉద్యమాత్మక, సేవాత్మక సంస్థ. ఇది ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించడమే కాకుండా, విద్యా రంగ అభివృద్ధికి కూడా కట్టుబడి ఉంది. ఈ సంస్థకు సభ్యత్వం పొందడం ద్వారా ఉపాధ్యాయులు తమ సమస్యలకు సమర్ధవంతమైన వేదికను పొందగలుగుతారు," అని అన్నారు. జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ "ఈ సంవత్సరం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల స్థాయిలో విస్తృతంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామనీ, ఉపాధ్యాయులలో ఐక్యత పెంచడం, వారి సమస్యలకు పరిష్కారం సాధించడం మా ప్రాథమిక లక్ష్యం. ప్రతి ఉపాధ్యాయుడూ సంఘం లో భాగస్వామిగా ఉండాలని కోరుతున్నాం," అని వివరించారు. సభ్యత్వం పొందిన ఉపాధ్యాయులకు సంఘ సేవలు, సాంకేతిక సహాయం, సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గదర్శనం లభిస్తుందని వారు తెలియజేశారు. గత సంవత్సరాలలో ఏపీటీఎఫ్ సాధించిన విజయాలు, ప్రభుత్వంతో జరిగిన చర్చలు, విద్యా విధానాలపై కలిగిన ప్రభావాన్ని ప్రస్తావించారు. కార్యక్రమంలో కనిగిరి ఏపీటీఎఫ్ నాయకులు ఏ హాజరత్ రెడ్డి, జి ప్రభాకర్, దండే శ్రీనివాసులు, పి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ







**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ జులై 2**

త్వరలో పోలీసులకు శిక్షణ నేపథ్యంలో ఒంగోలులోని పోలీస్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్ ను బుధవారం ఉదయం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ సందర్శించారు. అనంతరం డిటిసి చుట్టూ వున్న పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్ లు, ఓపెన్ జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్ ను ఇతర అధికారులతో కలసి పరిశీలించి, శిక్షణ నిమిత్తం అవసరమైన అన్ని ఏర్పాటులను త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, డీటీసి ఇన్స్పెక్టర్ షమీముల్లా, పిసిఆర్ ఎస్సై వేణుగోపాల్, ఆర్ఎస్ఐ రవి కుమార్, సిబ్బంది ఉన్నారు.

# మెప్మా ఆర్పీల సమ్మె నోటీస్



**గిద్దలూరు, పెన్ పవర్ జులై 2**

ఈరోజు గిద్దలూరు మెప్మా కార్యాలయం నందు ఆర్పీల సమస్యలపై సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. సందర్భంగా మెప్మో ఆర్పీల సంఘం నాయకురాలు ఎస్కే ఫాతిమా, డి రుతమ్మ, పి సాయి లక్ష్మి మాట్లాడుతూ మెప్మా ఆర్పి లందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, కాలపరిమితి సర్కులర్ రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి, 10 లక్షల రూపాయల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని , పెండింగ్ వేతన బకాయిలు చెల్లించాలని, 2019 నుండి రిజిస్ట్రేషన్ అయిన ఆర్పీలకు లాగిన్ ఇవ్వాలని, పదివేల రూపాయలు ప్రభుత్వమే గౌరవేతనం చెల్లించాలని, రాజకీయ కారణాలతో ఆర్పీలను తొలగించరాదని, మహిళ మార్ట్ లో పొదుపు మహిళలు పెట్టిన పెట్టుబడులు తిరిగి సభ్యులకు చెల్లించాలని, మొబైల్ సిమ్ కార్డు ఇవ్వాలని రీఛార్జి చేయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వ తేదీన జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సమ్మె చేస్తున్నామని గిద్దలూరు సిఎంఎం గారికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.

# ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 2**

మండలంలోని వి.బైలు, చెన్నపునాయునిపల్లి సచివాలయ పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టును భర్తీ చేయడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నోటిఫికేషన్ జారీ చేసిందని అర్హత కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి మురళి తెలిపారు పదవ తరగతి ఉత్తీర్ణులై స్థానికులై వివాహిత అయి ఉండాలన్నారు దరఖాస్తుల స్వీకరణకు చివర తేదీ ఈనెల 6వ తేదీ లోపు దరఖాస్తులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి సమర్పించాలని తెలిపారు.

# ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంతోనే రాష్ట్ర అభివృద్ధి , సంక్షేమం సాధ్యం

**తాటిచెర్ల పంచాయతీలోని గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఇంటింటికీ పంచిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్.**

**గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రజా సంక్షేమం శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తోనే సాధ్యం.**







**కొమరోలు పెన్ పవర్ జూలై 2**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం సాధ్యమని తొలి సంవత్సరంలోనే రుజువు చేశారని కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం తొలి ఏడాది పాలనను దిగ్విజయంగా, విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాల పంపిణీ కార్యక్రమం తాటిచెర్ల పంచాయతీలోని గ్రామాలలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైంది. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనని వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో ఆ పంచాయతీలోని తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ,వార్డు మెంబర్లు ,పంచాయతీ ,వార్డుల ఇన్చార్జీలు ఉత్సాహంగా ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను పంచిపెట్టారు .ఆ సందర్భంగా వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాల ద్వారా రాష్ట్రం అన్ని రంగాలలో తీవ్రంగా నష్టపోయి పూర్తిగా వెనుకబడిపోయిందని అన్నారు .ప్రజలు కూడా సంక్షేమ పథకాలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి రోజు నుంచే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి ఆ దిశగా అడుగులు వేశారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నింటినీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వాలలోని ప్రభుత్వం దశలవారీగా నెరవేరుస్తున్నదని అన్నారు. ఇప్పటికే తల్లికి వందనం దీపం పథకం ద్వారా ఉచిత మూడు గ్యాస్ సిలిండర్లు ,భారీగా పెంచిన సామాజిక పెన్షన్లు తదితరు వాటిని అమలు చేశారని ,అలాగే రాష్ట్రవ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి పేదలకు ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారని అన్నారు .ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఆయన పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు ,రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం తదితర హామీలన్నింటిని దశలవారీగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నదని ఆయన పేర్కొన్నారు. 2014- 19 మధ్య కాలంలో గిద్దలూరు నియోజకవర్గం ముత్తుముల అశోక్ రెడ్డి సారథ్యంలో ఎంతో అభివృద్ధి చెందిందని అంటూ ,కూటమి ప్రభుత్వ సహాయ సహకారాలతో గిద్దలూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించి ప్రజలకు మెరుగైన సేవలు సౌకర్యాలు కల్పించి రాష్ట్రంలోనే గిద్దలూరు నియోజకవర్గం ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే ఆశయంతో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు .నిష్కలంక, నిస్వార్ధ హృదయంతో ప్రజా సంక్షేమమే పరమార్ధంగా భావించి ప్రజాసేవకు అంకితం అవుతున్న శాసనసభ్యులు అశోక రెడ్డి సారథ్యంతోనే గిద్దలూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో పలు పంచాయతీలకు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి వెళతాం..చేసింది చెపుతాం :కందుల

**సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే**









**మార్కాపురం ఆర్.సి ఇన్చార్జి పెన్ పవర్ జూలై 2**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు తాము చేస్తామన్న ప్రతిది చేస్తున్నామని, చేసే కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ విజయాలను ప్రతి గడపకు తెలియజేసే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్కాపురం పట్టణంలోని ఆరో వార్డులో, రూరల్ పరిధిలో దరిమడుగు గ్రామం,కర్లపాడు మండలంలోని తర్లుపాడు గ్రామలలో పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుండి అందుకుంటున్న పథకాల గురించి వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తొలిరోజు పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందించి ఆ కుటుంబం ప్రభుత్వం నుండి పొందిన లబ్ది తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టామని, ప్రజల ఆశలు,ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని టీడీపీ, జనసేన, బిజెపి పార్టీలతో ప్రభుత్వ సుపరిపాలన తొలి అడుగు పూర్తి చేసుకుందన్నారు. తొలి ఏడాది విజయవంతంగా చేసిన పాలనతో రెండో ఏడాది చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. 30 రోజుల పాటు ప్రతి ఇంటికి బూత్ స్థాయి కన్వీనర్లు, కో కన్వీనర్లు, యూనిట్ క్లస్టర్ స్థాయి కన్వీనర్లు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తారని తెలిపారు. ఏడాదికాలంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఆ కుటుంబసభ్యులకు వివరించి వారి ఆమోదం తీసుకుని భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అభిప్రాయాలను తీసుకుంటారని తెలిపారు. ఎన్నికల హామిల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామిలను తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు వెళ్తుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆపార అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం హామిలను అమలు చేయనున్నామని అన్నారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని కూడా అమలు చేసేందుకు సీయం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భర్త చనిపోయిన మహిళలకు వెంటనే పించన్లు అందచేస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్దిలో భాగంగా సిమెంట్ రోడ్లు, సైడు కాలువలు, ప్రజలకు అవసరమైన మౌళిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి ఈ ఏడాదిలో తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రజలకు పారదర్శక పాలన అందించే లక్ష్యంగా ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబసభ్యులతో మమేకమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి స్పష్టం**





**పొదిలి, పెన్ పవర్, జూలై 2**

ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు బుధవారం నాడు పొదిలి పట్టణంలోని ఒకటవ వార్డులో జరిగిన సుపరిపాలన లో మొదటి అడుగు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేస్తున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన చెప్పారు అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ, రాష్ట్రంలోని పేద బలహీన బడుగు వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతో ప్రశంసనీయమన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు పారదర్శక పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**పీసీపల్లి పెన్ పవర్ జూలై 2**



రాష్ట్ర ప్రజలకు పారదర్శక పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి నిర్వహించారు . ఇందులో భాగంగా ప్రజల ఇంటి వద్దకు వెళ్ళి మొదటి ఏడాదిలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మరియు కనిగిరి నియోజకవర్గంలో చేపట్టిన అభివృధి మరియు సంక్షేమం పనులను వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకున్నారు. సంవత్సర కాలంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమాన్ని ప్రజలకు వివరిచారు. ప్రతి ఇంటికి వెళ్లిన ఆయన ప్రజల యోగక్షేమాలు అడిగి, వారికి అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్, తల్లికి వందనం మరియు ఉచిత గ్యాస్, రైతు సంక్షేమం పథకాను వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తేదేపా రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ రావు, మండల పార్టీ నాయకులు వేమూరి రామయ్య, గ్రామ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గత వైఎస్సార్ సీపీ వలె కోతల రాయుళ్ల ప్రభుత్వం కాదు

ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం. -ప్రజలకు పారదర్శక సుపరిపాలన అందించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

వైకాపా హయాంలో ఎంత మంది పిల్లలంటే అంత మందికి అమ్మ వడి అన్నారు , ఎంతమందికి ఇచ్చారు?-సంపూర్ణ మద్య నిషేధం , జరిగిందా?

ప్రతి జనవరి లో జాబ్ క్యాలెండర్ అన్నారు , గత ఐదేండ్లలో జాబ్ క్యాలెండర్ వచ్చిందా?

ఇంటింటికి వెళ్లి ఏడాది పాలన పై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని గత జగన్ పాలన వైఫల్యాలను వివరిస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ జులై 2**

గత ప్రభుత్వం మాటలు బారేడు చేతలు జానెడు అనే విధంగా ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఎద్దేవాచేశారు . బుధవారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని 2వ వార్డులో "సుపరిపాలనలో తొలిఅడుగు" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల పై అభిప్రాయాలు తెలుసుకొని కూటమి ప్రభుత్వ ఏడాది పరిపాలన పై ప్రజల నుంచి వారి అభిప్రాయాలు సేకరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని తక్షణమే పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. గత ప్రభుత్వం నాడు ఇచ్చిన హామీలన్నీ విస్మరించి మరచి, తగుదునమ్మా అంటూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం పైన బురద చల్లడం పట్ల అశోక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వైసీపీ పాలకులు అమ్మఒడి పథకం ఎంతమందికి ఇచ్చారని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాజీ సీఎం జగన్ ని ప్రశ్నించారు. మద్యపాన నిషేధం ఏమైందని, జాబ్ క్యాలెండర్ ఎందుకు విడుదల చేయలేదన్నారు. సిపిఎస్ రద్దు చేశారా...? పెట్టుబడులు పెట్టే కంపెనీలను కక్షపూరితంగా పారిపోయేలా చేసింది మీరు కాదా.. రాష్ట్రం పై కక్షపూరితమైన పాలన చేసి 100శాతం హామీలు అమలు చేశామని ఏ విధంగా చెప్పుకుంటున్నారని మాజీ సీఎం జగన్ ను ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గట్టిగా నిలదీసి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం



పరిపాలన ప్రారంభించిన ఏడాదిలోపే 9లక్షల 30 వేల కోట్ల రూపాయలు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకు వచ్చిందని ఇప్పటికే నిరుద్యోగుల కోసం డీఎస్సీ విడుదల చేశామని, అన్న క్యాంటీన్లు ప్రారంభించడం, దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం, తల్లికి వందనం పథకం ద్వారా బడికి వెళ్లే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలలో రూ.15 వేలు జమ చేయటం ఇప్పటికే జరిగిందని ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సీఎం ప్రారంభించబోతున్నారని, అతి త్వరలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కూడా ఇస్తామని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు మూడు విడతలుగా రూ.20 వేలు అందిస్తామని తెలిపారు.

కూటమి ప్రభుత్వం పై వైసిపి అసత్యాలు ప్రచారాలు చేస్తూ ఏం మొహం పెట్టుకొని ప్రశ్నిస్తున్నారని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి నిప్పులు చెరిగారు. మీ హయాంలో ఏ స్కీం చూసిన దోపిడేనని , నాడు దోచుకోవడం , దాచుకోవటమే పనిగాపెట్టుకున్నారని, మద్యం దోపిడీ, ఇసుక ,మట్టి , లదోపిడీలు ఎన్నోజరిగాయని, దోపిడీకి ఏదీ అనర్హం కాదనట్లు అన్నిట్లో దోపిడినే నని విమర్శించారు. నాడు అంత చేసి ప్రజలకు పంగానామాలు పెట్టి మళ్ళీ ఇప్పుడు ప్రల్లోకి వస్తారట ? ఏ మొహంపెట్టుకుని వస్తారని అశోక్ ప్రశ్నించారు. తల్లికి వందనం ఇంటిలో పిల్లల అందరికి ఇవ్వలేదంటారా! పోలవరం పనులు పరుగులు పెట్టటం లేదని చెపుతారు, రాష్ట్రనికి పెట్టుబడులు రావటం లేదని చెపుతారా! అమరావతిలో అభివృద్ధి జరగటం లేదంటార, అమరావతిలో రోజు 10 నుంచి 15 వేల మంది కార్మికులు పంచేసేది మీకు కనిపించటమ్ లేదా , మీరు వదిలేసిన రోడ్ల మరమ్మతులు చేయలేదని చెపుతారా ? ఇక ఏ మొహం పెట్టుకుని ప్రజల వద్దకు వస్తారని వైకాపా నాయకులను అశోక్ రెడ్డి సూటిగా ఘాటుగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, 2వ వార్డు కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గోన్నారు.

## ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత చంద్రబాబు, రాచకొండ లక్ష్మయ్య.



**పెన్ పవర్, గుంటూరు, జూలై. 2.**

ఉమ్మడిఆంధ్రప్రదేశ్ నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగో చారి ప్రమాణ స్వీకారం చేసిన దగ్గర నుంచి ఈరోజు వరకు ఈ రాష్ట్రానికి అభివృద్ధి వనరులు ప్రాజెక్టులు పరిశ్రమలు రోడ్లు డ్రైనేజీలు అనేక రకాలైన అభివృద్ధి కార్యక్రమం చేసిన ఘనత మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుది. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో గుంటూరు తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు నశీర్ అహ్మద్ సూచనలతో 51 వ డివిజన్ కార్పొరేటర్ ముప్పవరపు భారతి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య ఇంటింటికి తిరిగి ఈ ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, పథకాలను ప్రజలకు వివరించాము ఈ కార్యక్రమంలో ప్రజలందరూ ఈరాష్ట్ర ప్రభుత్వం యొక్క పాలనపట్ల హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం, ఎన్టీఆర్ పెన్షన్ భరోసా, ఏడాదికి మూడు సిలిండర్లు వంటి పథకాలన్నీ అందుతున్నాయని లక్ష్మయ్య తెలియజేశారు. ఇటువంటి సుపరిపాలనకే తాము ఎల్లప్పుడూ ఓటు వేస్తామని ఆనందం వ్యక్తం చేశారు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు ఈ కర్యక్రమానికి రాచకొండ నారాయణ సోమయ్య నాగార్జున వెంకటేష్ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమ్మెకు పిలుపు

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూలై 02**

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరుతూ జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు పల్నాడు భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మసూద్ శిలార్ పిలుపునిచ్చారు. చిలకలూరిపేటలోని కళామందిర్ సెంటర్‌లో సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరణ..



# అశోక్ రెడ్డి తొలి అడుగు కార్యక్రమంలో వార్డులో అడుగడుగునా ఘన స్వాగతం




**గిద్దలూరు పెన్ పవర్ జులై 2**

తెలుగు దేశం పార్టి అధిష్టానం పిలుపు మేరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి బుధవారం నాడు గిద్దలూరు లో ప్రారంభించారు . ఈసందర్భంగా అశోక్ రెడ్డి ఇంటింటికి వెళ్లి గత వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు , ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాదిలో అందించిన సుపరిపాలన , సంక్షేమం అబివృద్ధి ని వివరిస్తూ పర్యటిస్తున్నారు. ఈసందర్భంగా ఆయావార్డుల్లో ప్రజలు అశోక్ రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్నారు. జోరు వర్షం కురుస్తున్న అశోక్ రెడ్డి తడుస్తూనే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద ఆయనకు బూడిదగుమ్మడికాయ యలతో మహిళలు దిష్టి తీయటం , మరికొందరు మంగళహారతులు ఇవ్వటం , దుశ్శాలువా లతో పూల మాలాలంకృతల చేస్తూ సత్కరించటం, వరుణుడు వర్షించి పులకింప చేస్తుండగా ప్రజలు పూల వర్షం కురిపిస్తూ అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఆయన ప్రస్తుత కూటమి పాలన విషం అడుగుతుండగా చిరునవ్వు చిందిస్తూ భేషుగ్గా ఉందని , అరాచకం పోయి సుపరిపాలన వచ్చిందని చెపుతుండటం విశేషంగా కని పిస్తోంది. వార్డులో సమస్యలు ఏమైనా ఉన్నాయా యని



అడుగగా అడకుండా నే వరాలిచ్చే మీరుండగా ఇక సమస్యలు ఎక్కడ అని ఎదురు ప్రశ్న వేస్తున్నారు ప్రజలు, పైన చంద్రన్న ఇక్కడ మీరుండగా మాకు దిగులేంటికి అని అంటున్నారు. ఒకటవ తేదీ తెల్లారక మునుపే నిద్రలేపి పెంక్షన్లు అందిస్తున్నారు . ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లి కి వందనం డబ్బులు పడ్డాయని తెలుపుతున్నారు ప్రతి ఇంటి వద్ద సత్కారలే సత్కారాలు.

# కనిగిరిలో ప్రారంభమైన ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు




**కనిగిరి ఆర్సీఇంచార్జ్ పెన్ పవర్ జూలై 2**

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమం కనిగిరిలో బుధవారం విజయవంతంగా నిర్వహించబడింది. రాష్ట్ర కౌన్సిలర్ పి. రాజ్ కుమార్, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పి. రాజ్ కుమార్ మాట్లాడుతూ "ఏపీటీఎఫ్ ఒక ఉద్యమాత్మక, సేవాత్మక సంస్థ. ఇది ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించడమే కాకుండా, విద్యా రంగ అభివృద్ధికి కూడా కట్టుబడి ఉంది. ఈ సంస్థకు సభ్యత్వం పొందడం ద్వారా ఉపాధ్యాయులు తమ సమస్యలకు సమర్థవంతమైన వేదికను పొందగలుగుతారు," అని అన్నారు. జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ "ఈ సంవత్సరం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల స్థాయిలో విస్తృతంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామనీ, ఉపాధ్యాయులలో ఐక్యత పెంచడం, వారి సమస్యలకు పరిష్కారం సాధించడం మా ప్రాథమిక లక్ష్యం. ప్రతి ఉపాధ్యాయుడూ సంఘం లో భాగస్వామిగా ఉండాలని కోరుతున్నాం," అని వివరించారు. సభ్యత్వం పొందిన ఉపాధ్యాయులకు సంఘ సేవలు, సాంకేతిక సహాయం, సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గదర్శనం లభిస్తుందని వారు తెలియజేశారు. గత సంవత్సరాలలో ఏపీటీఎఫ్ సాధించిన విజయాలు, ప్రభుత్వంతో జరిగిన చర్చలు, విద్యా విధానాలపై కలిగిన ప్రభావాన్ని ప్రస్తావించారు. కార్యక్రమంలో కనిగిరి ఏపీటీఎఫ్ నాయకులు ఏ హజరత్ రెడ్డి, జి ప్రభాకర్, దండే శ్రీనివాసులు, పి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ భద్రతపై అవగాహన ర్యాలీ




**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూలై 2**

మార్కాపురం పట్టణంలో జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలలో భాగంగా విద్యుత్ శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యుత్ కార్యాలయం నుండి దోర్నాల సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వర్షాకాలంలో విద్యుత్ భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. తడిచేతులతో విద్యుత్ స్తంభాలు ముట్టుకుంటే విద్యుత్ షాక్ కు గురవుతారని ,తదితర విషయాల పై అవగాహన కల్పించారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని సూచించారు. మీ ప్రాణం కన్నా విలువైనది ఏదీ లేదు అని సూచించారు.

## రోడ్డుకు డాక్టర్ హనుమంతరావు నామకరణం



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూలై 02**

స్థానిక గాంధీ రోడ్డు లో ఒక బజారుకు డాక్టర్ హనుమంతరావు వీధి అని మునిసిపాలిటీ నామకరణం చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. సుమారు 55 సంవత్సరాలు వైద్య వృత్తిలో సుదీర్ఘ ప్రజా సేవలు అందిస్తూ పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తూ ప్రజా డాక్టర్ గా పేరొందిన డాక్టర్ పూరిమెట్ల హనుమంతరావు ను డాక్టర్స్ డే సందర్భంగా స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోగానికి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండటం ,మంచి నిద్ర పోవటం, మంచి ఆహారం తీసుకోవడం వల్ల 90 శాతం రోగాలు తగ్గుతాయని తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన సన్మానించిన వారిలో నిర్వాహకులు ఉదయ్ నెట్ నిర్వాహకులు సాయి, శ్రీనివాసులు, రాము, ఝాన్సీ, ఉపాధ్యాయులు పీవీ రమణారావు, వంశీ, విజయలక్ష్మి, మంజుల, పీవీ సుబ్బారావు శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతి సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు తదితరులు ఉన్నారు.

## రేపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ మార్కాపురం పర్యటన వివరాలు

**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూలై 2**

రేపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ మార్కాపురం పర్యటన షెడ్యూల్. ఉదయం 10:45 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి మార్కాపురం పట్టణం శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. ఉదయం 10:45 గంటలకు హెలిప్యాడ్ నుండి రోడ్ మార్గంలో సాయి బాలాజి స్కూల్ ఎదురుగా సభా ప్రాంగణానికి చేరుకుంటారు. ఉదయం 11:15 గంటల నుండి 11:25 గంటల వరకు ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి త్రాగునీటి సరఫరా ప్రాజెక్ట్ కు జల్ జీవన్ మిషన్ ద్వారా 1290 కోట్ల రూపాయలు మంజూరైన సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 11:25 గంటల నుండి 12:45 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 01:30 గంటల నుంచి 01:35 గంటలకు సభా ప్రాంగణం నుండి రోడ్ మార్గంలో హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 01:40 గంటలకు హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ ద్వారా గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరుతారు.



## ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడును పరామర్శించిన బుర్రా



**కందుకూరు పెన్ పవర్, జూలై 2**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగం లో భాగంగా అక్రమ అరెస్టుకు గురై బెయిలు మీద జైలు నుండి విడుదల అయిన కందుకూరు మండలం ఓగూరు గ్రామస్తులు కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు దగ్గుమాటి కోటయ్య ను బుధవారం ఆయన స్వగృహమునకు వెళ్లి మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు కుటుంబానికి మనోధైర్య వచనాలు తెలిపారు. ఇన్చార్జి వెంట వైఎస్ఆర్సిపి నాయకులు ఉన్నారు.

## బుర్రాను కలిసిన మొయిళ్ల గౌరి రెడ్డి



**కందుకూరు పెన్ పవర్, జూలై 2:**

వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన రీకాలింగ్ బాబు మేనిఫెస్టో పేరుతో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోలో పథకాలు అందాయా లేదా అని ప్రజలను అడిగే కార్యక్రమంలో మహిళా విభాగం కీలకంగా వ్యవహరించాలని మధుసూధన్ యాదవ్ సూచించారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్న పట్టించుకోకుండా, మహిళల రక్షణ పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం పూర్తిగా వైపల్యం చెందిదని నియోజకవర్గంలో ఎక్కడ మహిళలకు అన్యాయం జరిగిన వై.సి.పి మహిళా విభాగం వారికి అండగా నిలవాలని మధుసూధన్ యాదవ్ సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ ప్రజాసమస్యల పై,ప్రజల పక్షాన ప్రతిపక్ష గళం వినిపించేల మండల ,నియోజకవర్గ ,జిల్లాస్థాయి ల్లో మహిళలందరు సమన్వయంతో పనిచేసేల పలు అంశాల పై చర్చించిన వారిలో మొయిళ్ల గౌరి నియోజకవర్గ అధ్యక్షురాలు తుళ్లూరి ఆదిలక్ష్మి,ధరణి తదితరులు పాల్గొన్నారు. దృశ్యాలువతో సత్కరించారు.

## వైభవంగా ప్రారంభమైన అఖండ సాయి నామ సప్తాహ వేడుకలు

**కనిగిరి ఆర్సీఇంచార్జ్ పెన్ పవర్ జూలై 2**

కనిగిరి షిర్డీ సాయిబాబా దేవస్థానంలో బుధవారం నుంచి సాయిబాబా అఖండ సాయి నామ సప్తాహము, గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈఅఖండ సాయి నామ సప్తాహము గురుపౌర్ణమి ఉత్సవాలును గౌరవ నీయులైన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహ రెడ్డిని సత్కరించి స్వామి వారి ప్రసాదం అందించారు. సాయిబాబా అఖండ జ్యోతి ప్రజ్వలన సానికొమ్ము రంగనాయకులు రెడ్డి, పద్మావతి దంపతులు చేశారు. సాయి భక్తులు మహిళలు వందలాది మంది సాయి నామ సంకీర్తనలతో పట్టణంలోని పలు వీథుల్లో బిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఓం సాయి శ్రీ సాయి అను నామ సంకీర్తన సప్తాహం ఏడు రోజులు పాటు రేయింబవళ్ళు నిరంతరంగా ఆలపిస్తారు. కార్యక్రమంలో దేవస్థానం గౌరవ అధ్యక్షులు బోయిళ్ళ తిరుపతి రెడ్డి, కుందురు తిరుపతి రెడ్డి, కమిటీ అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, కార్యదర్శి బాలు ఓబులురెడ్డి , కోశాధికారి ముచ్చర్ల ధర్మారావు, సంయుక్త కార్యదర్శి కొలిపర్తి మారుతి కుమార్, సంయుక్త కోశాధికారి వాగిచెర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు తంగుటూరి గోవింద రావు, మండ్ల వెంకటేశ్వర్లు, వీసీ రామశాస్త్రి, సింగరాజు మాలకొండేశ్వరరావు, ఏసీ చెంచులు, నార్లపాటి సాంబశివరావు , శ్రీరాం మురళి, కమిటీ సభ్యులు పాల్వాది జయరాం, మారెళ్ళ ఉమాకాంత్, పల్లా మాలకొండ్రాయుడు, వంటేరు పెద్దన్న, బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు,మునగా ప్రసాదు, ఇన్నమూరి సుబ్బారావు, కోటయ్య, ఫుల్లారెడ్డి, చెక్క చెన్నకేశవులు, వేమా రంగ, పైడిమర్రి వెంకటకృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.



# ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తున్న టిడిపి పార్టీ నాయకులు









**కందుకూరు పెన్ పవర్, జూలై 2**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్ళి వారికి మొదటి ఏడాదిలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కందుకూరు నియోజకవర్గంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృధి మరియు సంక్షేమం పనులను వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షులు క్లస్టర్ యూనిట్ బూత్ లెవెల్ ఇంచార్జ్ లు నియోజకవర్గ టిడిపి నాయకులు అనుబంధ విభాగాలు అధ్యక్షులు పాల్గొన్నారు.సంవత్సర కాలంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమాన్ని ప్రజలకు టిడిపి నాయకులు వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లిన టిడిపి నాయకులు వారి యోగక్షేమాలు అడిగి, వారికి అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్, తల్లికి వందనం మరియు ఉచిత గ్యాస్ పథకాలు వస్తున్నాయో లేదో ప్రజలను అడిగి తెలుసుకున్నారు.. మరియు ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేస్తే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ద్వారా సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తామని ప్రజలకు పార్టీ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండల పార్టీ అధ్యక్షులు క్లస్టర్ యూనిట్ బూత్ లెవెల్ ఇన్చార్జిలు గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## శివరాంపురం, కొండేపల్లి గ్రామాలలో

# పొలం పిలుస్తుంది





**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూలై 2**

మండలం లోని శివరాంపురం, కొండేపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.మండల సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడిఏ మాట్లాడుతూ కౌలుకు సాగు చేసేటువంటి రైతు సోదరులు వీఆర్వో ని సంప్రదించి కౌలు పత్రం తీసుకోవాలని సూచించారు. కౌలు పత్రం తీసుకోవడం వలన కౌలు రైతులు పంట నమోదు అతివృష్టి అనావృష్టి సమయంలో పంట నష్టపరిహారం, సబ్సిడీ ద్వారా విత్తనాలను పొందడానికి పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకోవడానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. పచ్చి రొట్టె ఎరువులు అనగా జనుము, జీలుగులు, పిల్లి పెసర వంటివి సాగు చేయడం వలన నేల సారానికి, స్వభావానికి, పంట దిగుబడికి మేలు చేస్తుందని తెలిపారు. అదేవిధంగా పచ్చి రొట్టె పంటలను ప్రధాన పంట వేసే ముందు లేదా ప్రధాన పంటతో పాటు వేసి ఆ తరువాత వాటిని నేలలో కలిపి వేయడం వలన రైతుకు సహజ సిద్ధమైన ఎరువుగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ సీజన్ కి సంబంధించి రైతులు వేసినటువంటి పంటను బట్టి సంబదిత పత్రాలతో సిఎస్సి కేంద్రాలలో పంటల బీమా పథకం కింద వరి 860, కంది 430, ఎండుమిరప 4500, మినుము 205 ఎకరానికి ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకం కింద పేరు ను నమోదు చేయించుకోవాలని అన్నారు. రైతులు వాణిజ్య పంటల సాగుని తగ్గించి మెట్ట పంటలైన కంది,మినుము, పెసర ,జొన్న ,కొర్ర వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మండల వ్యవసాయ అధికారిని బుజ్జి బాయ్, హార్టి కల్చర్ ఆఫీసర్ రమేష్, గ్రామాల సర్పంచులు, వి ఎ ఎ లు హైమావతి, కైరుంబీ, వెటర్నరీ అసిస్టెంట్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## గిద్దలూరు పీర్ల పండుగకు ముస్తాబయిన పీర్లు



**గిద్దలూరు పెన్ పవర్ జులై 2**

గిద్దలూరు పట్టంములోని సర్కార్ పీర్ల చావిడిలో పేర్లను బుధవారం నాడు దించి సుందరంగా అలంకరించి పీఠం పై ప్రతిష్టించారు దీంతో మొహారం వేడుకలకు సన్నాహాలు జరిగాయి. పీర్ల గుండం కూడా త్రవ్వి సిద్ధంగా ఉంచారు మొహారం వేడుకలకు పీర్లను ముస్తాబు చేస్తున్నారు. జులై 4 చిన్న సరిగేసు,5వ తేది పగలు సరిగేసు, 6 వ తేది పెద్ద సరిగేసు, 7వ తేది సోమవారం స్థానాలు ( షహదత్ ) నిర్వహించడం జరుగుతుందని పీర్ల చావిడి ముజావరులు తెలియచేశారు. ప్రజలు, భక్తులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని పీర్ల పండుగను జయప్రదం చేయగలరని కోరార్.

## గుడ్లూరులో ఇంటింటికి సుపరిపాలనలో

# తొలి అడుగు కార్యక్రమం

### పండుగ వాతావరణంలో ఇంటింటికి ప్రచారం.

### ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ అభివృద్ధి కరపత్రాలతో వివరణ.



**గుడ్లూరు, పెన్ పవర్, జులై 02:**

కూటమి ప్రభుత్వం తన పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో ఇంటింటి ప్రచారాన్ని పండగ వాతావరణంలో ప్రారంభించి, ఏడాది కాలంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం పెట్టుకుంది. దీనిలో భాగంగా మండల కేంద్రమైన గుడ్లూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు ఆధ్వర్యంలో కూటమి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ను లాంఛనంగా ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ కూటమి ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తూ, ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు కూడా స్వీకరించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు మాట్లాడుతూ కందుకూరు అభివృద్ధి ప్రదాత ప్రజా సంక్షేమం కోసం నిరంతరం తపించే మన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆశయాలు, లక్ష్యాలు కొనసాగేలా ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలను అందించే భాద్యత కూటమి ప్రభుత్వం తరఫున ఖచ్చితంగా అమలు చేస్తామని, గత వైకాపా ప్రభుత్వ కాలంలో కేవలం బటన్ నొక్కుడు పేరుతో పప్పు బెల్లాలు కొంతమంది కి చేర్చారే గానీ ప్రజలందరికీ న్యాయం ఏమాత్రం జరుగక పోవడమే కాకుండా అభివృద్ధి ఊసే లేదని అన్నారు. నేడు అలాకాకుండా విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో నిజాయితీకి మారుపేరైన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, దేశ అభివృద్ధి ప్రదాత నరేంద్రమోడీ ఉత్తమ కలయిక వల్ల ప్రజలందరి దీవెనలతో మంచి ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తున్నామని, తల్లికి వందనం పేరుతో ఇంట్లో చదువుకునే ప్రతి బిడ్డకు లబ్ధి చేకూరిందన్నారు. ఇలా ప్రతి ప్రభుత్వ పథకం అర్హులైన లబ్ధిదారులకు అందేలా కూటమి ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు జొన్నలగడ్డ రమణమ్మ, సర్పంచ్ పాలకీర్తి శంకర్, మండల జనసేన నాయకులు మూలగిరి శ్రీనివాస్, అన్నంగి చలపతి, బిజెపి మండల అధ్యక్షులు ఇన్నమూరి ప్రమీల సుధాకర్, గ్రామ టీడీపీ అధ్యక్షులు ఉన్నం వెంకటేశ్వర్లు, పువ్వాడి వేణు, రావూరి వేణు, మేకపోతుల రాఘవయ్య, ఉమ్మనేని సుబ్బారావు, మేకల మాల్యాద్రి తదితర టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి రూ:10,116/- లు విరాళం



**గుడ్లూరు, పెన్ పవర్, జులై 02**

మండలంలోని చెమిడిదపాడు గ్రామ బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి సింగరాయకొండ మండలం శానంపూడి గ్రామానికి చెందిన జ్యేష్ఠ నరసింహం, నిర్మల, నరేంద్ర , శ్రీలేఖ, అభయ పర్ణిక లు 10,116/- రూపాయలు విరాళంను ఆలయ ట్రస్టు అధ్యక్షులు ఆలూరి వెంకట హనుమంతరావుకు (ఫోన్ పే ద్వారా) అందజేశారు. వారికి, వారి కుటుంబ సభ్యులకు సీతారామ లక్ష్మణ భరత శత్రుజ్ఞ సహిత శ్రీ సువర్చలా పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ, ట్రస్టు తరుపున హనుమంతరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

## బాపట్ల జిల్లాకు జాతీయ కౌన్సిల్ సభ్యులను ప్రకటించడం హర్షనీయం

**జిల్లా అధ్యక్షుడు బంగారు బాబు**



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జులై 2**

భారతీయ జనతా పార్టీని బాపట్ల జిల్లాలో జాతీయ కౌన్సిల్ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ సహకారంతో మరింత బలోపేతం చేస్తామని భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు బంగారు బాబు అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులుగా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, వెంకటరమణ ను పార్టీ పెద్దలు ఎంపిక చేసి బాపట్ల జిల్లాకు ప్రాముఖ్యత కలిగించారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ జిల్లాకు రెండు జాతీయ కౌన్సిల్ సభ్యులను కేటాయించి తమ బాధ్యత మరింత పెంచారని రానున్న రోజులలో ప్రతి నాయకుడు,కార్యకర్త సహాయ సహకారాలతో భారతీయ జనతా పార్టీని తిరుగులేని పార్టీగా తీర్చిదిద్ది ముందుకు నడుస్తామన్నారు. బాపట్ల జిల్లాలో అభివృద్ధి పనులు కోసం వివిధ కార్యాచరణల రూపొందిస్తున్నామని కుటమి ప్రభుత్వంతో జిల్లా ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి పరిశ్రమల స్థాపన కోసం భారతీయ జనతా పార్టీ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు బాల నారాయణ, రూరల్ అధ్యక్షుడు పేరిరెడ్డి, కే శ్రీనివాసరాజు, మణి యాదవ్, ఎం రమేష్ కుమార్, టి శ్రీనివాసరాజు, శ్రీహరి,షేక్ కరిముల్లా, పి రామకృష్ణ సాయి, కె.వి రామకృష్ణ, శ్రీనివాసరాజు,టీ గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్పిలకు ట్యాబ్‌లు పంపిణి





**పెన్ పవర్ నరసరావుపేట ప్రతినిధి జులై 2**

పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ఆదేశాల మేరకు మంగళవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా లో పనిచేస్తున్న ఆర్పిలకు ట్యాబ్ లు పంపిణీ కార్యక్రమం నరసరావుపేట పట్టణ కమ్యూనిటీ హాల్ నందు జరిగింది. సమాఖ్య అధ్యక్షురాలు షేక్ అఖిల చేతుల మీదగా ట్యాబ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షేక్ అఖిల మాట్లాడుతూ మెప్మా ఆన్లైన్ సేవలు సులభతరం చేసేందుకు ఆర్పి లకు ప్రభుత్వం ట్యాబ్ లు మంజూరు చేసిందాని చెప్పారు. డ్వాక్రా సంఘాల సమీక్ష సమావేశాలు, బ్యాంకు రుణాల లావాదేవీలు, మహిళల వ్యాపారాలు తదితర సమాచారం అప్లోడ్ చేశెందుకు ట్యాబ్ లు ఉపయోగకరంగా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టు టౌన్ సమైక్య సెక్రటరీ అంకమ్మ, ట్రెజరరీ మల్లేశ్వరి మరియు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఎన్నికైన గుండాల సురేష్ బాబు కి సన్మానం



**పెన్ పవర్ నరసరావుపేట ప్రతినిధి జులై 2**

పల్నాడు జిల్లా నరసరావుపేటలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా ఎన్నికైన గుండాల సురేష్ బాబు కి బిసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నాడు సన్మాన కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక న్యాయస్థాన,బార్ అసోసియేషన్ పెద్దలు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ ఏపీపీగా ఎన్నికైన గుండాల సురేష్ బాబు నిత్యం ప్రజా సమస్యల పరిష్కారములో భాగస్వామ్యమై, అనేక సామాజిక ఉద్యమాలలో ముందుండి, పేద, మధ్యతరగతి సమస్యల పక్షాన నిలబడి సేవలు అందించారని అన్నారు. అనంతరం స్థానిక న్యాయస్థాన బార్ అసోసియేషన్ పెద్దలు మాట్లాడుతూ గుండాల సురేష్ బాబు ప్రముఖ న్యాయవాదిగా ప్రజలకు విలువైన న్యాయ సేవలు అందించడని కొనియాడారు. అతని సేవలను గుర్తించిన మన శాసనసభ్యులు చదలవాడ అరవింద బాబు సహకారంతో ఏపీపీగా ఎన్నికైన గుండాల సురేష్ బాబు ను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బాలాజీ, రొంపిచర్ల మండల అధ్యక్షులు గాలి సాంబశివరావు, యువజన అధ్యక్షులు సుతారం విశ్వేశ్వరరావు, యువజన నాయకులు బోస్ బాబు, శివరాత్రి గోపి, చల్లా శ్రీను బాబు తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల ఆశయాలకు తోడు

## - కలెక్టర్ మురళి ఏడాది సేవా యానం













**-ఏడాది పాలనలో చెరగని ముద్ర**
**-ప్రజల మనసులను చూరగొన్న కలెక్టర్ వెంకట మురళి**
**-విధుల పట్ల అంకితభావం..**
**పాలనలో నిబద్ధతకు నిదర్శనం**
**-నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కలెక్టర్ ప్రయత్నాలు**
**-వరదల వేళ కలెక్టర్ స్పందన అద్భుతం..**
**-పి-4 లో రాష్ట్రం లోనే ప్రథమం**
**-తరతరాలు పేదరికంలో ఉన్న గిరిజనులకు ప్రభుత్వ ఫలాలు**
**-ఎస్టీల ఆధార్ నమోదుకు శ్రీకారం**
**-గిరిజనులు- దివ్యాంగుల కొరకు ప్రత్యేక గ్రీవెన్స్**
**-చీరాల కుప్పడం పట్టు చీరలకు జాతీయస్థాయి గుర్తింపులో కలెక్టర్ పాత్ర**
**-గవర్నర్ చేతుల మీదుగా బంగారం పతకం అందుకున్న వెంకట మురళి**
**-సంతృప్తికరంగా ఏడాది పాలన : కలెక్టర్**

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జులై 2:**

ఆయనకు కలెక్టర్ ఉద్యోగం అంటే గొప్ప హోదా అని ఏనాడు అనుకోలేదు. ఇదంతా బాధ్యతగానే భావించారు. విద్యార్థి దశ నుంచే ప్రజలకు సేవ చేయడం ఎలా అని ఆలోచించేవారు. దీనికి ప్రభుత్వ ఉద్యోగమే సరైన మార్గం అని ఎంచుకున్నారు. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయడంతో పేదరికం ఆయనకు అడ్డు రాలేదు. మొదట సబ్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగంలో చేరారు. తనకిచ్చిన పనిలో ప్రజల ప్రేమను పొందారు. ప్రజాసేవకు పరిధి పరిమితంగా ఉండడంతో ఇంతకంటే ఉన్నత ఉద్యోగానికి వెళ్లాలని ఆకాంక్షించారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివడం... ఆ పరీక్షల్లో ఉత్తీర్ణత స్థాయి రాష్ట్ర ప్రథమ ర్యాంకర్ గా నిలిపింది. ఆయనే మన బాపట్ల జిల్లా కలెక్టర్ జరుగు వెంకట మురళి. సబ్ కలెక్టర్ గా పరిపాలన విభాగంలోకి ప్రత్యక్షంగా ప్రవేశించారాయన. 2024 జులై 4వ తేదీన బాపట్ల జిల్లా కలెక్టర్ గా చేరడంతో ఆయన బాధ్యత మరింత పెరిగింది. ఇలా ఉద్యోగన్నతి పొందడం, తనలో ఉన్న సేవా గుణానికి అధికార పరిమితులు అధికమయ్యాయి. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రతిక్షణం అంకితభావం దర్శనమిస్తోంది. సమాజంలో నిరాదరణకు గురైన దివ్యాంగులు, ఎస్టీలకు న్యాయం చేయాలని ప్రతినెల నాలుగో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తూ సేవలందిస్తున్నారు.

**బాపట్ల జిల్లా అభివృద్ధికి :** నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ఆయన ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా వ్యవసాయం, మత్స్య, చేనేత రంగాలలో వ్యాపార వృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందించారు. బాపట్లలోని పర్యాటక వనరులను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రణాళికలు రచించారు. ఈ రంగాల అభివృద్ధితో జిల్లాకే గాకుండా రాష్ట్రానికి ఆదాయ వనరు, ఆదర్శంగా మార్చడమే ఆయన లక్ష్యం. ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగులు, సంఘాలు, కళాకారులను సమన్వయం చేసుకుంటూ వివిధ రకాలుగా ప్రణాళికలు రూపొందించారు. అవన్నీ ఇప్పుడు కార్యాచరణలో ఉన్నాయి. జిల్లాకు కలెక్టర్ గా వచ్చిన తొలినాళ్లలోనే అన్ని ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. శతాబ్దాల క్రితం బ్రిటిష్ పాలనకు ముందే విదేశీ వర్తక వాణిజ్య కేంద్రంగా ఉన్న మోటుపల్లి ఓడ రేవును మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు చారిత్రక పరిశోధకులు, పురావస్తు శాస్త్రవేత్తలతో పలుమార్లు చర్చించారు. అలనాటి వీరభద్ర స్వామి దేవాలయాన్ని మ్యూజియం, పర్యాటక ప్రాంతంగా చేయడానికి చర్యలు ప్రారంభించారు. భూమి కేటాయించడంతోపాటు చారిత్రాత్మక సంపదగా ఉన్న వీరభద్రస్వామి విగ్రహాన్ని తెప్పించేందుకు ఏర్పాట్లు మొదలు పెట్టారు.

**విపత్తులో ప్రజలకు తోడుగా :** కృష్ణానది వరద విపత్తులు గతేడాది సెప్టెంబర్ 2 లో సంభవించగా నేనున్నానంటూ లంక గ్రామాల ప్రజలకు ధైర్యం కల్పించి ప్రభుత్వ సహాయం అందించడంలో కృతార్థులయ్యారు. రాత్రి పగలు తేడా లేకుండా కృష్ణానది చెరువులోని కొల్లూరు ప్రాంతంలో ప్రజల మధ్యనే ఉండి సహాయక చర్యలు అందించారు. వరదలో చిక్కుకున్న 30 వేలమంది నిరాశ్రయులను తన కుటుంబ సభ్యులుగా భావించి అన్ని తానై నిలిచి సేవలందించారు. వరద విపత్తుతో నీట మునిగిన గ్రామాలకు పడవల ద్వారా తాగునీరు, ఆహార పదార్థాలను ఐదు రోజులు పాటు అందించడం, తదుపరి 24 గంటల్లోనే రహదారులు, విద్యుత్ ను పునరుద్ధరించారు. సహాయక చర్యలు అందించడంలో జిల్లా కలెక్టర్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం భేష్ అని అభినందించగా, రాష్ట్ర గవర్నర్ బంగారు పతకంతో సత్కరించారు. ప్రజలకు విశేష సేవలు అందించే రెడ్ క్రాస్ సంస్థ సభ్యత్వ నమోదులోనూ బాపట్ల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలువగా గవర్నర్ చేతుల మీదుగా ప్రత్యేక అవార్డు అందుకున్నారు.

**ఎస్టీలకు ఆధార్: ...**

చెరువులు, కాల్వల గట్లపై దుర్భర జీవితం సాగిస్తున్న ఎస్టీలకు జీవనాధారం కల్పించారు. వారి జీవన స్థితిగతులను గుర్తించిన కలెక్టర్ డిసెంబర్ నెలలో సర్వేకు ఆదేశాలిచ్చారు. 48,700 ఎస్టీలను సర్వే చేయగా 1,900 మందికి ఆధార్ కార్డులు లేనట్లుగా గుర్తించారు. వారి వద్ద ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆర్డీవోలు పంచనామా నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్ తో జనన, చిరునామా ధ్రువీకరణ పత్రాలను జారీచేసి తద్వారా ఆధార్ కార్డులు అందించారు. తదుపరి పొదుపు సంఘాలలో చేర్పించి స్థిరమైన జీవనోపాధి కల్పించారు. వారికోసం ప్రతి నెల నాలుగో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తూ వారి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నారు. అలాగే దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించి తక్షణమే పరిష్కార మార్గం చూపుతున్నారు.

**పర్యాటకంపై ముద్ర :**

బాపట్ల జిల్లాను పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లో భాగంగా బాపట్ల తీర ప్రాంతాన్ని పర్యాటక హబ్ గా మార్చడానికి చర్యలు ప్రారంభించారు. సూర్యలంక బీచ్ లో వేలాది మొక్కలు నాటించారు. ఆయన రూపొందించిన అభివృద్ధి ప్రణాళికకు కార్యరూపం ఇస్తూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అడవి గ్రామం వద్ద పర్యాటకులు బోట్ షికార్ చేయడానికి వీలుగా తయారుచేసిన ప్రణాళిక త్వరలో రూపుదిద్దుకోనుంది. సూర్యలంక పేరళి కెనాల్ నుంచి నిజాంపట్నం ఓడరేవు వరకు గత ఏడాది జూలై 14 తేదీన ఆయన సాహసోపేతంగా పడవలో ప్రయాణించారు. మడ అడవుల మొక్కల సంరక్షణ, అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని ప్రభుత్వం అభినందించింది. వాటి అభివృద్ధికి ఆయన రూపొందించిన ప్రణాళిక అమలుకు అంగీకారం తెలిపింది. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో తీర ప్రాంతాలలో విస్తృతంగా మొక్కలు నాటిస్తున్నారు.

**పి-4 లో : ... రాష్ట్రం లోనే ప్రథమం**

అత్యంత నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పి-4 విధానానికి స్వీకారం చుట్టింది. రాష్ట్రమంతా చేపట్టే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్నగంజాం మండలం పెద్దగొల్లపాలెం గ్రామంలోనే ప్రారంభించారు. జిల్లాలో ఇలాంటి 62,388 నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా నామకరణం చేశారు. వారికి ఎలాగైనా సహాయం చేయాలని 3528 మందిని మార్గదర్శిలుగా చేర్చడం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. పి-4 కింద 14 కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు జీవనోపాదులవృద్ధికి సాయమందించారు. చీరాలకు చెందిన ఓ ఆనాథ యువకుడిని డిఆర్డిఎ ద్వారా దత్తకు తీసుకుని రూ.50వేలు తక్షణమే సహయం అందిచటంలో కలెక్టర్ వెంకట మురళి ప్రత్యేక చొరవ చూపారు.

**స్వచ్ఛత వైపు అడుగులు :**

చెత్త రహిత జిల్లా లక్ష్యంగా కలెక్టర్ అడుగులు ముందుకు వేస్తున్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని భావించిన కలెక్టర్ వెంకట మురళి పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఇందుకొరకు ఎంపీడీవోలు, డిప్యూటి ఎంపీడీవోలు,గ్రామ కార్యదర్శులతో బాపట్లలో మే22వ తేదీన చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, గ్రామాల పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. రహదారులు వెంట చెత్త కనిపించరాదంటూ అధికారులకు సూచనలు ఇచ్చారు. నెల రోజుల పాటు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. చెత్త దంప్ చేయటానికి స్థలాల లేని చోట తక్షణమే భూమి కేటాయించాలని రెవిన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**కలెక్టర్ ఔదార్యం:**

పారిశుధ్యంలోనూ కార్మికుల రక్షణ చర్యలు తీసుకున్నారు. వారికి అవసరమైన గ్లౌజులు, మాస్కులు షూస్, కొబ్బరి నూనె, సబ్బులు, చీపుర్లు, పారలు వంటి పరికరాలు, పనిముట్లను కలెక్టర్ నిధి నుంచి రూ.50లక్షలతో కొనుగోలు చేసి అందించారు. స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తూనే గ్రీన్ అంబాసిడర్ల ఆరోగ్య సంరక్షణ బాధ్యతను తీసుకున్నారు. అంత మాత్రమే కాకుండా పలు గ్రామాలలో పర్యటించి తడి,పొడిగా చెత్తను ఇంటి వద్దనే విభజించాలని నేరుగా ప్రజలకు వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద సృష్టించే విధానంపై ఫోకస్ పెట్టారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవటంలో కలెక్టర్ వెనకాడటం లేదు.

**అర్జీదారులకు కడుపునిండా భోజనం :...**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నేరుగా కలెక్టర్ కు సమస్యలు విన్నవించుకోవడానికి జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారులకు ప్రతి సోమవారం ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఆకలితో వెను తిరగకూడదని కలెక్టరేట్ ఆవరణలోనే ప్రతి సోమవారం, నెలలో నాల్గో శుక్రవారం జరిగే ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ కు వచ్చే అర్జీదారులకు కలెక్టర్ ఉచిత భోజనాన్ని అందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వినియోగించే సామాజిక మాధ్యమాలలో వచ్చే ఫిర్యాదులకు సైతం ఆయన తక్షణమే స్పందిస్తున్నారు. ఇటీవల కర్లపాలెం మండలంలో పేరలీ గ్రామంలో బెల్టు షాప్ నిర్వహిస్తున్నారని ఓ మహిళ బాపట్ల జిల్లా కలెక్టర్ సామాజిక మాధ్యమంలో ఫిర్యాదు చేశారు. సమస్యపై కలెక్టర్ వేగంగా స్పందించారు.

**చీరాల కుప్పడం :**

చీరాల కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డు లభించేలా కలెక్టర్ విశేషంగా కృషి చేశారు. జనవరి 9వ తేదీన కేంద్ర బృందం సభ్యులు ఇష్ దీప్, డాక్టర్ దివ్యడింగ్రా క్షేత్రస్థాయి పరిశీలనపై బాపట్ల చీరాలలో పర్యటించారు. చేనేత వస్త్రాలైన కుప్పడం చీరల ఉత్పత్తులు, అమ్మకాలు, చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై కేంద్ర బృందానికి నివేదిక అందించడంతోపాటు కలెక్టర్ చక్కగా వివరించారు. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఒడిఒపి)కింద కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డును కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 14వ తేదీన న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డును కలెక్టర్ అందుకోనున్నారు. సంప్రదాయ మగ్గాలపై నేతన్నలు నేసిన చీరాల కుప్పడం చీరలకు మరింత ప్రాచుర్యం లభించనుంది. చేనేతల కష్టాలు తీరనున్నాయి.

**పొగాకు కొనుగోలు :**

బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టడంతో బాపట్ల జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారు. చీరాల, పర్చూరు, జెపంగులూరు, ఇంకొల్లు మండలాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవడంలో ప్రధాన పాత్ర పోషించారు. వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రయోజనం పొందేలా ప్రభుత్వ నిర్ణయాన్ని రైతుల వద్దకు చేరుస్తున్నారు. ప్రతి కేంద్రంలో కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పూర్తిస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

**హాస్టల్స్ లో మౌలిక సదుపాయాలు :..**

వసతి గృహాల విద్యార్థుల కష్టాలు తెలుసుకున్న కలెక్టర్ మానవతా దృక్పథంతో స్పందించారు. జిల్లాలో ఎస్సీ,బీసీ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ లో మౌలిక సదుపాయాల కల్పనకు కలెక్టర్ వెంకట మురళి దృష్టి సారించారు. పేద విద్యార్థులు ఆరోగ్యంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవడానికి డిస్టిక్ మినరల్ ఫండ్ కేటాయించారు. 68 ఎస్సీ, ఎస్టీ,బీసీ హాస్టల్స్ తో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలోనూ విద్యార్థుల మౌలిక అవసరాల కొరకు రూ. ఒక కోటి 18 లక్షలు నిధులు ఇచ్చారు. హాస్టల్స్ మరమ్మతుల కొరకు మరో కోటి 76 లక్షలు నిధులు కేటాయించారు. విద్యార్థుల సౌకర్యం కోసం ప్రతి హాస్టల్లో మినరల్ వాటర్ ప్లాంట్, గీజర్, కుర్చీలు, ఇచ్చారు. విద్యార్థుల సంరక్షణ కొరకు ఒక్కొక్క వసతి గృహానికి ఎనిమిది చొప్పున సీసీ కెమెరాల టీవీలను ఏర్పాటు చేశారు.

**ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కొరకు :...**

జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం గురి కాకుండా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ సిబ్బందితో సర్వే నిర్వహించారు. గుర్తించిన ప్రభుత్వ భూములకు రక్షణ చర్యలు చేపట్టారు.

**అనాధ శిశువులకు అండగా :...**

అనాధ శిశువులకు ఆశ్రయం కల్పించే శిశు గృహంను కలెక్టర్ సందర్శించారు. వారి బాగోగులు చూసుకోవాలని సిబ్బందికి మార్గ నిర్దేశం చేశారు. వారిని తన తన బిడ్డలుగా భావిస్తున్నాను అంటూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు కలెక్టర్. తద్వారా నిరంతరం ఆయన పర్యవేక్షిస్తున్నారు.

## తూకాల్లో నిత్యం మోసపోతున్న

# వినియోగదారులు

**తూతూ మంత్రంగా తూనికలు కొలతల తనిఖీలు..!**

**పత్తాలేని తూనికలు, కొలతల శాఖ అధికారులు**

**దాడులకు దూరం.. మామూళ్లకు దగ్గర**

**అడ్డగోలుగా దోచేస్తున్న వ్యాపారులు**

**సిబ్బంది కొరతతో శాఖకు ఇబ్బందులు**




**పెన్ పవర్, ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రతినిధి, జూలై, 2**

కాసుల దాహంతో వ్యాపారులు చేస్తున్న మోసం.. కండ్లు మూసుకొని నిద్ర నటిస్తున్న అధికారుల నిర్లక్ష్యం వెరసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. నిత్యావసర వస్తువుల తూకాల్లో పట్టు తప్పుతున్నా, వ్యాపారుల మోసాలను నియంత్రించేందుకు చట్టాలున్న, ప్రజల్లో అవగాహన కొరవడడం అవరోధంగా మారింది. ఎవరికి వారే తమకెందుకు అనే ధోరణిలో ఉండటం వల్ల వ్యాపారులు విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. తనిఖీలు చేయాల్సిన అధికారులకు మామూళ్ళ మత్తులో జోగుతుంటే వ్యాపారాలు ఇష్టారీతిన దోచుకుంటున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వినియోగదారులు కోరుతున్నారు. నిత్యం మనం ఎన్నో రకాల వస్తువులను కొనుగోలు చేస్తుంటాం. తూనిక లేదా కొలత విషయంలో ఏ విధమైన మోసానికి గురి కాకుండా నాణ్యమైన వస్తువులను పొందటం వినియోగదారులుగా మన హక్కు. కాని ఆ హక్కును సాధించుకోగలగటం అంత సులభమేమీ కాదు. ప్రస్తుత వ్యాపార విధానాలతో మనం ఎన్నో రకాలుగా మోసాలకు గురవుతూనే ఉన్నాం. వస్తువులపై ముద్రించిన ధర కంటే ఎక్కువ ధరను చాలా చోట్ల వ్యాపారులు వసూలు చేస్తూనే ఉన్నారు. కిలో అని కండ్ల ముందే తూచి, ఇచ్చిన కందిపప్పు వాస్తవానికి ఎనిమిది వందల గ్రాములే ఉంటోంది. జి.ఎస్.టి. పుణ్యమా అని బియ్యం బస్తా మీద 26 కేజీలు అని ముద్రించి 24 కేజీలను వినియోగదారులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. పాలు లేదా నూనె కొలత విషయంలోనూ తరుగు సర్వసాధారణంగా ఉంటోంది. పెట్రోలు బంకుల్లో ఆపరేటర్ల హస్తలాఘవం వల్ల వాహనదారులు ఎంతో కొంత నష్టపోక తప్పటం లేదు. కేవలం కొనేటప్పుడే ఇలాంటి తరుగు ఉంటుందనుకొంటే పొరపాటే! రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన ధాన్యాన్ని అమ్మేటప్పుడు 70కిలోల బస్తాకు దాదాపు ఆరేడు కిలోలు తూకంలో మోసాల కారణంగా నష్టపోతున్నారు. ఇలా తూనికలు-కొలతల్లో మోసాలవల్ల వినియోగదారులు తాము చెల్లించే డబ్బుకు తగిన విలువైన వస్తువును పొందలేక నష్టపోతున్నారు. కనుక ఈ విషయంలో వినియోగదారుల రక్షణ కోసం ప్రవేశపెట్టినదే తూనికలు-కొలతల చట్టం. గతంలో తూనికలు-కొలతలు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రీతిగా ఉండేవి. కొలతలకు ఒక ప్రాంతంలో మానికను ఉపయోగిస్తే మరొక ప్రాంతంలో శేరు'ను ఉపయోగించేవారు. అలాగే తూనికలు-కొలతలకు సంబంధించి మూర, సోల, గిద్ద, వీశె, సవాశేరు ఇలా వేర్వేరు కొలతలు వాడేవాళ్లు ఉండేవారు. దీనివల్ల వినియోగదారుల్లో వస్తువు పరిమాణం, విలువ విషయంలో కొంత అయోమయం ఉండేది. అయితే స్వాతంత్ర్యానంతరం దేశమంతటా ఒకే విధమైన తూనికలు-కొలతలను ఉపయోగించేలా నిర్ణీత ప్రమాణాలను రూపొందించారు. 1976వ సంవత్సరంలో స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ యాక్టు ప్రవేశపెట్టారు. ప్యాక్ చేసి అమ్మే వస్తువులకు సంబంధించి స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ (ప్యాకేజ్ కామొడిటీస్) రూల్స్ను రూపొందించారు. దేశవ్యాప్తంగా ఈ చట్టాన్ని ఒకే విధంగా అమలు చేసేందుకు వీలుగా 1985 లో స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ (ఎన్ఫోర్స్మెంట్) యాక్ట్ను ప్రవేశపెట్టారు. తూనికలు-కొలతల చట్టాన్ని అమలుచేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ప్రతి రాష్ట్రంలో ఉన్నట్టే మన రాష్ట్రంలో కూడా లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ ప్రధానాధికారిగా ఈ విభాగం పని చేస్తోంది. రీజనల్ డిప్యూటీ కంట్రోలర్లు, అసిస్టెంట్ కంట్రోలర్స్, డిస్ట్రిక్ట్ ఇన్స్పెక్టర్ లు, ఇన్ స్పెక్టర్లు ఈ శాఖలోని ప్రధాన అధికారులు.

**ఎవరికి ఫిర్యాదు చేయాలి?..**

తూనికలు-కొలతల విషయంలో మోసపోయినట్లు భావించినప్పుడు స్థానిక లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్కు ఫిర్యాదు చేయవచ్చు. లేదా కంట్రోలర్కు ఫిర్యాదు చేయవచ్చు. లీగల్ మెట్రాలజీ గ్రీవియన్స్ ఆఫీసర్ కు ఫిర్యాదు చేయవచ్చు. వ్యాపారి మోసగిస్తున్నట్టు నిరూపణయితే వ్యాపారికి జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంది. స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ యాక్ట్ 1976, స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ ఎన్ఫోర్స్మెంట్ యాక్ట్ 1985 లలో 1986లో చేసిన సవరణల వల్ల వినియోగదారులు, గుర్తింపు పొందిన వినియోగదారుల సంఘాలు నేరుగా కోర్టుల్లో కేసులు దాఖలు చేసే అవకాశం లభించింది. సవరణలకు ముందు ఈ అధికారం కేవలం తూనికలు-కోలతల అధికారులకు మాత్రమే ఉండేది. వినియోగదారుల రక్షణ చట్టం అమలులో భాగంగా ఏర్పాటైన జిల్లా వినిగదారుల కమిషన్, రాష్ట్ర కమిషన్, జాతీయ కమిషన్లలో కేసు దాఖలు చేసి నష్టపరిహారం పొందవచ్చు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# తొలి అడుగుతో వెల్దుర్తిలో వైసిపి ఖాళీ..!

**- ఎంపీపీ సంజీవ్ రెడ్డి వైసీపీకి గుడ్ బై..! -అదే బాటలో ముగ్గురు ఎంపీటీసీ, మాజీలు..!**

**- గంపగుత్తగా టీడీపీలో చేరిన 100 కుటుంబాలు**



**వెల్దుర్తి: జులై 02 ( పెన్ పవర్ న్యూస్ )**

మండల పరిధిలో శిరిగిరిపాడు గ్రామంలో మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో బుధవారం ప్రారంభించిన "సుపరిపాలన తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ" కార్యక్రమం ప్రజల హర్షధ్వానాల నడుమ సంబరంగా సాగింది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అప్రతిహతంగా జరుగుతున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమాన్ని చూసి ఆకర్షితులైన మండల వైసీపీ నాయకులు పెద్దఎత్తున టీడీపీలోకి క్యూ కట్టారు. వెల్దుర్తి మండల వైసీపీ సీనియర్ నాయకులు, ప్రస్తుత మండల పరిషత్ అధ్యక్షులు అలుగుమల్లి సంజీవ్ రెడ్డి, గంగలకుంట ఎంపీటీసీ దాసరి చిన శ్రీనివాసరావు, వెల్దుర్తి ఎంపీటీసీ రాయనూతల లక్ష్మీ, శిరిగిపాడు -2 ఎంపీటీసీ రమావత్ బోడిబాయి, శిరిగిరిపాడు హాస్పటల్ చైర్మన్ దిర్శినాల హనిమిరెడ్డి, గంగలకుంట మాజీ సర్పంచ్ వెంకటరామయ్య, మాజీ ఎంపీటీసీ గండూరి వెంకటమ్మలతో పాటు పెద్ద సంఖ్యలో వార్డు మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు,సానుభూతిపరులైన దాదాపు 100 కుటుంబాలకు పైగా టీడీపీ కండువా కప్పుకున్నారు. పార్టీలో వస్తున్న వారికి ఎమ్మెల్యే జూలకంటి పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు.

**ప్రేమతో ఆహ్వానిస్తున్నాం.. బెదింపులతో కాదు..!**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమమే హద్దుగా పెట్టుకుని పనిచేస్తున్న విధానాలు మెచ్చి వైసీపీ నాయకులు ఆ పార్టీని వదిలి టీడీపీలోకి వస్తున్నారని ఆయన చెప్పారు. వైసీపీ వీడుతున్న నాయకులను ఎటువంటి ప్రలోభాలకు గురిచేయడం కానీ.., భయభ్రాంతులకు గురిచేడయం కానీ లేదన్నారు. ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో మాత్రమే టీడీపీలోకి వస్తున్నారని గతంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణరెడ్డి చేసిన రాజకీయాలను ఉద్దేశించి ఆయన విమర్శించారు. ఐదేళ్ల కాలంలో పిన్నెల్లి సోదర్లు టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టించి మరి కండువా మార్పిడి రాజకీయాలకు తెర తీశారని గుర్తు చేశారు. చంద్రబాబు దార్శనికతతో మాచర్ల నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో పాలన, రాజకీయాలు నడుస్తుంటే పచ్చని పల్లెల్లో చిచ్చు రాజేయ్యాలని మాజీ ఎమ్మెల్యే ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న హామీల అమలు చేయడం లో మిన్న

**సుపరిపాలనలో ఆంధ్రప్రదేశ్ ది కొత్త బెంచ్ మార్క్**

**67 లక్షల మందికి తల్లికి వందనం**

**64 లక్షల మందికి భద్రతా పెన్షన్లు**

**అభివృద్ధి, సంక్షేమం ఎజెండాగా పక్క రాష్ట్రాలతో పోటీ**

**వైసీపీకి ఇచ్చిన ఒక్క అవకాశంతో పాతికేళ్లు వెనక్కి**

**- విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్**







**పెన్ పవర్ ,జులై 2, అద్దంకి**

రాష్ట్ర ప్రభుత్వం అప్పుల బాధలో కూరుకున్నప్పటికీ వాగ్దానం చేసిన హామీలను ప్రథమ స్థానం ఉన్నదని, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో కొత్త బెంచ్ మార్క్ సెట్ చేసిందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన బల్లికురవలో బుధవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమంలో భాగంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ నిధులతో 16 తోపుడు బళ్లు చిరు వ్యాపారులకు, 8 ట్రై స్కూటీలను దివ్యాంగులైన లబ్ధిదారులకు అంద జేశారు. ఆ తరువాత ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో మంత్రి గొట్టిపాటి పర్యటించారు. ఈ క్రమంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల కాలంలో అందించిన సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలతో మాట్లాడి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలులో చిన్ని చిన్న సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే పరిష్కరించి లబ్ధిదారులకు సత్వర న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**దేశంలో ఎక్కడా లేని విధంగా సుపరిపాలన**

సుపరిపాలనకు సంబంధించి సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ కొత్త బెంచ్ మార్క్ సృష్టించిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా వేల కోట్ల రూపాయిలను సంక్షేమానికి ఖర్చు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో రాష్ట్రంలోని 67 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 15,000 రూపాయలు చొప్పున తల్లికి వందనం అందించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 42 లక్షల మందికి మాత్రమే అమ్మ ఒడి పథకం అందేదని చెప్పారు. అదే విధంగా సామాజిక భద్రతా పెన్షన్ల విషయంలోనూ ఏ రాష్ట్రంలో లేని విధంగా 64 లక్షల మంది లబ్ధిదారులకు ఏడాదికి 34,000 కోట్ల రూపాయలు వెచ్చించి పెన్షన్లను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. వెయ్యి రూపాయిలు పెంచడానికి గత ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టిందని మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే 3 వేల పెన్షన్ ను 4 వేల రూపాయలు చేయడంతో పాటు దివ్యాంగులకు 10 వేలు ఇస్తున్నామని తెలిపారు. పూర్తిగా మంచానికే పరిమితమైన రోగులకు నెలకు 15,000 రూపాయలు అందిస్తున్నామన్నారు. దీపం పథకం కింద అర్హులకు మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లను అందిస్తున్నట్లు తెలిపారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోనే ఇప్పటి వరకు సుమారు 50 కోట్లతో రోడ్లు నిర్మించినట్లు వెల్లడించిన మంత్రి గ్రామీణ ప్రాంతాల్లోనూ సీసీ రోడ్లతో పాటు తారు రోడ్లు కూడా నిర్మించామన్నారు.

**గత ప్రభుత్వ వేధింపులతో పెట్టుబడిదారుల పరారయ్యారు**

ఒక్క అవకాశం అంటూ అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వ చర్యలతో ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి ఆమడ దూరంలో ఆగిపోయిందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. అభివృద్ధిలో రాష్ట్రం 25 సంవత్సరాలు వెనక్కి పోయిందన్నారు. గత ప్రభుత్వ వేధింపులతో ఎందరో పెట్టుబడిదారులు రాష్ట్రం నుంచి పారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపి తిరిగి పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పెట్టుబడిదారుల్లో మరలా నమ్మకం కలిగించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా యువనేత లోకేష్ అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వ్యాపారవేత్తలకు రాయలసీమ, అనంతపురం వంటి జిల్లాలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పెట్టుబడిదారులకు పూర్తి భరోసా కల్పిస్తామని చెప్పారు. దీనితో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు ధీటుగా ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధిలో పోటీ పడే విధంగా చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి వివరించారు. లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి 16,300 టీచర్ పోస్టులను కూడా భర్తీ చేస్తున్నామని తెలిపారు. వీటితో పాటు 20 లక్షల ప్రైవేటు ఉద్యోగాల కల్పనకు కూడా అవసరం అయిన అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు.

**సంక్షేమం, అభివృద్ధి ప్రధాన ఎజెండాగా ఓటమి ప్రభుత్వం పని చేస్తుంది**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ప్రధాన ఎజెండాగా ముందుకు వెళ్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరించారు. పథకాల అమలు, ప్రజల సంతృప్త స్థాయిలకు సంబంధించి అధికారులు కీలకంగా వ్యవహరించాలన్నారు. గత ప్రభుత్వ విధానాలతో ఆర్థిక వ్యవస్థ కుదేలైనా ఎన్నికల ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్ తో పాటు మిగిలిన పథకాలనూ త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులు అందరికీ క్షేత్ర స్థాయి వరకు పథకాలు అమలయ్యేలా సంక్షేమ ఫలాలు అందేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ప్రజలకు సహకరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సింగయ్య మృతిపై అనుమానాలు.. భార్య 'సంచలన' ఆరోపణలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ కార్యకర్త సింగయ్య మరణంపై తమకు అనుమానాలు ఉన్నట్లు ఆయన భార్య లూర్దు మేరి తెలిపారు. చిన్న చిన్న గాయాలకే ఆయన మరణించాడని తాము భావించడం లేదని, అంబులెన్స్ లో ఏదో జరిగిందని సందేహం వ్యక్తం చేశారు. పోలీసులు, ప్రభుత్వం నుంచి ఈ కేసుపై తమపై తీవ్ర ఒత్తిడి ఉందని ఆమె ఆరోపించారు. సుమారు 50 మంది లోకేశ్ అనుచరులు తమ ఇంటికి వచ్చి బెదిరించారని, తాము చెప్పినట్లు చెప్పాలని ఒత్తిడి చేశారని ఆమె పేర్కొన్నారు. మేము కూడా మీ కులస్థులమేనంటూ కాగితాలపై ఏదో రాసి తమపై ఒత్తిడి చేసినట్లు సంచలన ఆరోపణలు చేశారు లూర్దు మేరి.గత నెల 18న మాజీ సీఎం జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన ప్రమాదంలో వైసీపీ కార్యకర్త సింగయ్య మరణించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి జగన్ కాన్వాయ్ కాదని ఒకసారి, ఆయన కాన్వాయ్ లోని ప్రైవేటు కారు అంటూ మరోసారి పోలీసులు ప్రకటనలు చేశారు. పర్యటన ముగిసిన రెండు రోజులుకు మాజీ సీఎం జగన్ కారు కిందే సింగయ్య పడిపోయిన దృశ్యాలతో వీడియో విడుదల చేశారు. దీంతో ఈ ఘటనపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగింది.సుమారు 15 రోజులపాటు ఈ వివాదం కొనసాగగా, పోలీసులు ప్రమాదానికి కారణమైన జగన్ కారు డ్రైవర్ రమణారెడ్డిపై కేసు నమోదు చేశారు. అంతేకాకుండా ప్రమాద సమయంలో కారులోనే ఉన్న మాజీ సీఎం జగన్ తోపాటు మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజిని, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, జగన్ పీఏ కేఎన్ఆర్ ను కూడా నిందితుల జాబితాలో చేర్చారు. దీనిపై మాజీ సీఎంతో సహా మిగిలిన నిందితులు హైకోర్టును ఆశ్రయించి తదుపరి చర్యలు తీసుకోకుండా ఉపశమనం పొందారు.ఈ పరిస్థితుల్లో సింగయ్య మరణంపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆయన భార్య లూర్దుమేరి ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. అంతేకాకుండా తమపై టీడీపీ యువనేత లోకేశ్ అనుచరులు ఒత్తిడి చేశారని ఆమె చెబుతున్నారు. తమను మాజీ సీఎం జగన్ మాత్రమే ఆదుకున్నారని ఆమె వ్యాఖ్యానించారు. దీంతో ఈ వివాదం మలుపు తిరిగినట్లు భావిస్తున్నారు.

# లేటెస్ట్ అప్ డేట్.. వంశీ సేఫ్.. ఇక, ఇంటికే!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి అన్ని వైపుల నుంచి ఊరట లభించింది. నాలుగు కేసులు దాఖలు కాగా.. వాటన్నింటికీ బెయిల్ లభించింది. అయితే.. మూడో కేసులో అంటే.. గన్నవరంలో మైనింగ్ అక్రమాలకు పాల్పడ్డారని నమోదైన కేసులో స్థానిక కోర్టు బెయిల్ ఇచ్చినా.. ప్రభుత్వం మాత్రం దీనిని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు గతంలో హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసేందుకు నిరాకరించింది. అదేవిధంగా ఈ కేసులోనే సీతామహాలక్ష్మి అనే మహిళ కూడా ఇంప్లీడ్ అయ్యారు. తన స్థలాన్ని వంశీ అను చరులు కబ్జా చేశారని ఆమె కేసు పెట్టారు. దీనిపై గన్నవరం పోలీసులు.. కేసు కట్టారు. అయితే.. దీనిని క్రిమినల్ కేసుగా పేర్కొన్నారు. దీనిలోనూ బెయిల్ వచ్చింది. అయితే.. ఈ బెయిల్ను రద్దు చేయాలని కోరుతూ.. సీతామహాలక్ష్మి కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపైనా విచారణ చేసిన కోర్టు.. అసలు సివిల్ కేసులో పోలీసులకు పనేంటని ప్రశ్నించింది.అంతేకాదు.. సివిల్ కేసును క్రిమినల్ కేసుగా మార్చే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో వంశీ బెయిల్‌ను రద్దు చేయడానికి నిరాకరించింది. ఇలా.. మొత్తంగా అన్ని కేసుల్లోనూ వల్లభ నేనికిబెయిల్ లభించింది. దీంతో ఆయనను బుధవారం జైలు నుంచి పంపించనున్నారు. ఇదిలావుంటే.. గన్నవరంలో సంబరాలు చేసేందుకు కార్యకర్తలు ఏ ర్పాట్లు చేస్తున్నారు. అయితే.. వీటిని పోలీసులు అడ్డుకున్నారు. ఎ లాంటి సంబరాలకు అనుమతులు లేవని పేర్కొన్నారు.

# తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు!



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలు మరోసారి వాడివేడిగా మారాయి. ముఖ్యంగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆయన చేసిన ఆరోపణలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

### చంద్రబాబు కోవర్టుల పాత్రపై ఆరోపణలు

ప్రాజెక్టుల వెనుక చంద్రబాబు కోవర్టుల పాత్ర ఉందని అనిరుధ్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. "బనకచర్ల విషయంలో ఒక ఎమ్మెల్యేగా నేను ఓ సూచన చేస్తున్నాను. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదు. అసలు విషయం ఏమిటంటే.. చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారు. వారే ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూస్తున్నారు" అంటూ మండిపడ్డారు.

ఈ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నీటి కనెక్షన్ కట్ చేయాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకూడదని ఆయన సూచించారు. "వాళ్లే చంద్రబాబుని కలిసి బనకచర్ల ప్రాజెక్టు పై స్టే తెప్పిస్తారు. మంచిగా మాట్లాడితే ఆంధ్రవాళ్లు వినరు" అని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

### రాజకీయ దుమారం, భిన్నాభిప్రాయాలు

ఇటీవలి కాలంలో తెలంగాణలో పాలన, ప్రాజెక్టుల అమలులో అనేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు వివాదానికి దారితీసే అవకాశం ఉంది. గతంలో కూడా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులపై రాజకీయ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, తాజా వ్యాఖ్యలు కొత్త దుమారాన్ని రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలు ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా పంచుకోబడుతూ భిన్నాభిప్రాయాలకు తావిస్తున్నాయి. తెలంగాణ-ఆంధ్ర సంబంధాల విషయంలో మరోసారి ఉత్కంఠ పరిస్థితులు నెలకొనవచ్చన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకులలో వ్యక్తమవుతోంది.

### ప్రభుత్వ స్పందనపై డిమాండ్లు

మొత్తానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అధికారిక స్థాయిలోనూ, విపక్షాల స్థాయిలోనూ స్పందన కోరుకుంటున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ప్రగతివంతమైన క్లారిటీ ఇవ్వాలన్న డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మలుపు తిరుగుతాయో చూడాలి.

# 2029 ఎన్నికలు : సీబీఎన్ Vs జగన్.. AI చెబుతుంది ఇదే..





**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో ఎన్నికలు ముగిసి ఏడాది మాత్రమే అయింది. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉంది. అయితే జమిలి ఎన్నికల ప్రచారంతో ఎన్నికలు ముందుగా జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రతిపక్ష నేత, మాజీ సీఎం జగన్ అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన ఆయన తన ఓటమికి ఈవీఎం గోల్ మాల్ అంటూ ఆరోపిస్తున్నారు. సుమారు 40 శాతం ఓటు బ్యాంకు ఉన్న వైసీపీకి కేవలం 11 సీట్లు రావడంపై జగన్, ఆయన పార్టీ నేతలు ఇప్పటికీ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో 2029 ఎన్నికల్లో మళ్లీ గెలిచి అధికారం చేపట్టాలని ఇప్పటి నుంచే ప్రణాళిక రచిస్తున్నారు. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. మరోవైపు అధికార కూటమి కూడా ప్రతిపక్షానికి 11 సీట్లు మాత్రమే వచ్చాయని అజాగ్రత్తగా ఉండొద్దని తన ఎమ్మెల్యేలను నిరంతరం అప్రమత్తం చేస్తూనే ఉంది. వచ్చే ఎన్నికలలో వరుసగా గెలిచి అధికారాన్ని సుస్థిరం చేసుకునేలా వ్యూహాలు రచిస్తోంది. ఇటీవల సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, ఆ తర్వాత టీడీపీ ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు టార్గెట్ 2029పై విస్పష్ట సంకేతాలు పంపారు. ఈ నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వచ్చే ఎన్నికల నాటికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మధ్య పోటీ ఎలా ఉంటుందన్న ప్రశ్నకు ఆసక్తికర విశ్లేషణ తెలియజేసింది. 2024 ఎన్నికల్లో మూడు పార్టీల కూటమి ద్వారా సుమారు 55 శాతం ఓటు బ్యాంకు సాధించి ఘన విజయం సాధించింది. ఇందులో టీడీపీకి సొంతంగా 45.6 శాతం ఓటు షేరు సాధించింది. ఈ ప్రజామద్దతు నిలుపుకుని 2029 ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారని ఏఐ తెలియజేసింది. అంతేకాకుండా తమ అధికారాన్ని నిలుపుకునేందుకు మూడు పార్టీల కూటమి బలంగా ఉండాలని కోరుకుంటున్నారని, డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి సాధిస్తున్నామని ప్రచారం చేస్తున్నారని తెలిపింది. ముఖ్యంగా కేంద్రీకృత అభివృద్ధి అజెండాతోనే ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని ఏఐ విశ్లేషించింది. అదేసమయంలో ప్రతిపక్ష నేత జగన్ ఎస్సీ, ఎస్టీలతోపాటు తనకు ఉన్న 40 శాతం ఓటు బ్యాంకును నిలుపుకుని ఇతర వర్గాలను ఆకట్టుకునేలా ప్రణాళిక బద్ధంగా నడుస్తున్నారని ఏఐ తెలిపింది. 2029 ఎన్నికల్లో కచ్చితంగా గెలుస్తానన్న నమ్మకంతో ఉన్న జగన్ ముందుగా పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేసేలా అడుగులు వేస్తున్నారని అంచనా వేసింది. ఇక ఇరువురు నేతల బలాబలాలు, బలహీనతలపైనా ఏఐ ఆసక్తికర విశ్లేషణ తెలియజేసింది. 2024 ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనపై కొంత వ్యతిరేకత కనిపిస్తున్నా పట్టణ మధ్య తరగతి, అగ్రవర్ణాలు, ఓబీసీల మద్దతు చెక్కుచెదరలేదని అంచనా వేసింది. అదేవిధంగా కూటమి పాలన ద్వారా మౌలిక సదుపాయాలు కల్పన, సంక్షేమ పథకాలు ద్వారా గ్రామీణ పేదలు, ఎస్సీ, ఎస్టీలను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పింది. కూటమి భాగస్వామ్య పక్షాలు బీజేపీ, జనసేనతో సమన్వయం కొనసాగించడం కూడా ముఖ్యమంత్రి చంద్రబాబును బలానికి కారణంగా చెబుతోంది. అదే సమయంలో వైసీపీలో జగన్ నాయకత్వంపై కేడర్ కు పూర్తి విశ్వాసం ఉండటం ఆయనకు బలం చేకూర్చుతోందని ఏఐ విశ్లేషించింది. అభివృద్ధి, పెట్టుబడుల సాధన, కొత్త ఉద్యోగాల సృష్టి వంటి అంశాలను ఎన్నికల ప్రచార అస్త్రాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు వాడుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్న ఏఐ .. అదే విషయంలో జగన్ మాత్రం తనకు ఉన్న గ్రామీణ మద్దతుదారులు,

ఎస్సీ, ఎస్టీ ఓటు బ్యాంకుపైనే ఎక్కువ నమ్మకం పెట్టుకున్నారని తెలిపింది. అదేవిధంగా టీడీపీ పట్టణ పార్టీగా.. వైసీపీ గ్రామీణ పార్టీగా అభివర్ణించింది. మంచి వాగ్దాటి, గ్యారెంటీ హామీల అమలు, భాగస్వామ్య పక్షాలతో సంయుక్త పోరాటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతుండగా, జగన్ గ్రామ స్థాయి నుంచి పార్టీని పునః నిర్మించుకోడానికి జిల్లాల పర్యటనలు, పాదయాత్ర వంటి కార్యక్రమాలతో పార్టీని 2029 ఎన్నికలకు సిద్ధం చేయాలని చూస్తున్నారని ఏఐ విశ్లేషించింది.

# నిన్న 'మే డే' కాల్, నేడు 'డోంట్ సింక్' అలర్ట్... ఇది ఎందుకో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** జూన్ 12న అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంతో ప్రపంచం మొత్తం ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఈ ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న వారు 241 మంది, బయట పౌరులు 19 మంది మరణించారు. ఆ విమానం ప్రమాదానికి గురయ్యే సెకన్ల ముందు పైలెట్ల నుంచి ఏటీసీకి "మే డే" కాల్ వచ్చిన సంగతి తెలిసిందే.దీంతో... ఏమిటీ మే డే కాల్ అనే చర్చ జరిగిన సంగతి తెలిసిందే. ఇది విమానంలో సమస్య ఎదురైనప్పుడు పైలెట్ల నుంచి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కు వచ్చే కాల్. అయితే... ఆ ప్రమాదం జరిగిన 38 గంటల్లోనే మరో ఎయిరిండియా విమానం టెన్షన్ పెట్టింది. ఇందులో భాగంగా... జూన్ 14 తెల్లవారుజామున ఢిల్లీ నుండి బయలుదేరి వియన్నాకు వెళ్తున్న బోయింగ్ 777 విమానం స్టాల్ హెచ్చరికను అందుకుంది.అవును... జూన్ 14 తెల్లవారుజామున ఢిల్లీ నుండి బయలుదేరి వియన్నా విమానం ఒక్కసారిగా 900 అడుగుల మేర కిందికి దిగిపోయింది. దీంతో... విమానంలోని ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. ఆ సమయంలో... గ్రౌండ్ ప్రాక్సిమిటీ వార్నింగ్ సిస్టమ్స్ (జీ.పీ.డబ్ల్యూ.ఎస్) నుంచి వార్నింగ్ సిగ్నల్ వెలువడింది.. అదే... "డోంట్ సింక్"! ఆ అలర్ట్ ఏమిటనేది ఇప్పుడు చూద్దామ్..!విమానం ల్యాండింగ్ సమయంలో లేదా భూమికి దగ్గరగా ఉన్నప్పుడల్లా మోడ్ - 1 హెచ్చరిస్తుంది. ఈ క్రమంలో వెలువడే ప్రారంభ హెచ్చరిక "సింక్ రేట్" (విమానం ఎత్తును కోల్పోయే రేటు) కాగా... విమానం పర్వతం పైకి లేదా నిటారుగా ఉన్న ప్రదేశాల మీదుగా ఎగురుతుంటే, అప్పుడు గ్రౌండ్ క్లియరెన్స్ వేగంగా తగ్గుతుంటే.. మోడ్ - 2 "పుల్ అప్" అని హెచ్చరిక జారీ అవుతుంది.ఇక... టేకాఫ్ తర్వాత పైలట్ లు సానుకూల ఆరోహణ రేటును నిర్వహించడానికి మోడ్ - 3 సహాయ పడుతుంది. ఇందులో భాగంగా... విమానం 1,000 అడుగులకు చేరుకున్న తర్వాత.. ఒక్కసారిగా ఎత్తు దిగడం ప్రారంభిస్తే సిస్టమ్ "డోంట్ సింక్" అనే హెచ్చరికను వినిపిస్తుంది. అదేవిధంగా... ల్యాండింగ్ గేర్ లేదా ఫ్లాప్ లు ల్యాండింగ్ కోసం సరిగ్గా కాన్ఫిగర్ చేయకపోతే మోడ్ - 4 హెచ్చరిస్తుంది.అంటే... విమానం చాలా వేగంగా కిందకు దిగుతున్నప్పుడు, ముఖ్యంగా భూమిని సమీపిస్తున్నప్పుడు లేదా భూమికి దగ్గరగా ఉన్నప్పుడు గ్రౌండ్ ప్రాక్సిమిటీ వార్నింగ్ సిస్టమ్ (జీ.పీ.డబ్ల్యూ.ఎస్) ద్వారా "డోంట్ సింక్" (మునిగిపోవద్దు) హెచ్చరికలు జారీ చేయబడతాయి. ఈ హెచ్చరికలు పైలట్ లకు ప్రమాదకరమైన పరిస్థితులను నివారించడానికి సహాయపడతాయి.కాగా... అత్యవసర ప్రమాద పరిస్థితిని ఎదుర్కొంటున్నామనే విషయాన్ని రేడియో కమ్యునికేషన్ ద్వారా సమీపంలోని ఏటీసీ కి తెలియజేయడానికి చేసేదాన్ని మేడే కాల్ అంటారనే సంగతి తెలిసిందే. అంటే... తాము ఆపదలో ఉన్నామని, తక్షణమే సాయం కావాలని విజ్ఞప్తి చేయడం అన్నమాట. ఎమర్జెన్సీ సమయాల్లో పైలెట్లు 'మేడే' అనే పదాన్ని మూడు సార్లు చెబుతారు!

# జగన్ నెల్లూరు పర్యటన రద్దు.. కారణం అదేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి నెల్లూరు జిల్లా పర్యటన తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. 3వ తేదీ గురువారం జగన్ నెల్లూరు పర్యటనకు ముందుగా షెడ్యూల్ ఖరారైంది. ఈ పర్యటనలో భాగంగా ఆయన అక్రమ మైనింగు కేసులో అరెస్టు అయిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించాలని భావించారు. అయితే హెలీపాడ్ ఎంపిక విషయంలో వైసీపీ, పోలీసులకు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జగన్ పర్యటన వాయిదా వేసుకున్నారు.

నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో ములాఖత్ అయ్యేందుకు జగన్ అనుమతి కోరారు. దీనికోసం జైలుకు సుమారు పది కిలోమీటర్ల దూరంలో హెలిపాడ్ ఏర్పాటుకు అక్కడి నుంచి ర్యాలీగా జైలుకు వచ్చేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరారు. అయితే వైసీపీ వినతిని పరిశీలించిన పోలీసులు జగన్ వచ్చే హెలికాప్టర్ కోసం సెంట్రల్ జైలు సమీపంలో హెలిపాడ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అయితే అక్కడ హెలిపాడ్ ఏర్పాటు చేయడం వల్ల జగన్ ప్రజలను కలిసే అవకాశం ఉండదని భావించిన వైసీపీ పోలీసుల ప్రతిపాదనను తిరస్కరించింది. అంతేకాకుండా హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయని, తుప్పలు ఎక్కువగా ఉండటం, రోడ్డు వసతి లేకపోవడంతో పోలీసులు సూచించిన చోట హెలిపాడ్ నిర్మాణం సాధ్యం కాదని వైసీపీ చెబుతోంది. దీనిపై కోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తోంది. జగన్ పర్యటనను అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసుల ద్వారా ప్రయత్నాలు చేస్తోందని వైసీపీ ఆరోపిస్తోంది.

తాము అధికారంలో ఉండగా, చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటనలు అడ్డుకున్నామా? అంటూ ప్రశ్నిస్తోంది. అయితే గత నెల 18న జగన్ పల్నాడు పర్యటనకు వెళ్లిన సమయంలో ముగ్గురు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలను దృష్టిలో పెట్టుకుని జగన్ పర్యటన ప్రశాంతంగా ముగిసేలా జైలుకు సమీపంలోనే హెలిపాడ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు పోలీసులు చెబుతున్నారు. దీంతో జగన్ నెల్లూరు పర్యటన మరోమారు అధికార, విపక్షాల మధ్య వాడివేడి మాటల యుద్ధానికి తెరలేపింది.

# బ్యాలన్స్ అదిరింది.. బ్యాటింగ్ డెప్త్ పెరిగింది: రెండో టెస్టుకు టీమిండియా ఆర్డర్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో బుధవారం (జూలై 2) ప్రారంభమైన తొలి టెస్టులో టీమిండియా మూడు మార్పులతో బరిలోకి దిగింది. ఈ మార్పులు భారత జట్టు సమతుల్యంగా ఉండేలా చేశాయి. ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి, స్పిన్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్ తుది జట్టులో స్థానం సంపాదించారు. వర్క్ లోడ్ కారణంగా బుమ్రాకు ఈ మ్యాచ్ లో రెస్ట్ ఇచ్చారు. శార్దూల్ ఠాకూర్, సాయి సుదర్శన్ లపై వేటు పడింది. బర్మింగ్‌హామ్ వేదికగా ఎడ్జ్ బాస్టన్ స్టేడియంలో టీమిండియా చేసిన ఈ మూడు మార్పులు కలిసి వచ్చేవే. టీమిండియా ప్లేయింగ్ 11 లోకి వచ్చిన ముగ్గురు కూడా బ్యాటింగ్ తో పాటు బౌలింగ్ చేయగలరు. నితీష్ కుమార్ కు ఆస్ట్రేలియాలో సెంచరీ చేసిన రికార్డ్ ఉంది. ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ స్వదేశంలో కీలక ఇన్నింగ్స్ లు ఆడి ఆకట్టుకున్నాడు. ఆకాష్ దీప్ సైతం చివర్లో బ్యాట్ ఝుళిపించగలడు. 9 వ స్థానం వరకు టీమిండియా బ్యాటింగ్ డెప్త్ బాగుంది. సాయి సుదర్శన్ స్థానంలో కరుణ్ నాయర్ రెండో టెస్టులో మూడో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. టాపార్డర్ లో బ్యాటింగ్ చేయగలిగే కరుణ్.. తనను తాను నిరూపించుకోవడానికి ఇది చక్కటి అవకాశం. 6, 7, 8 స్థానాల్లో నితీష్, జడేజా, సుందర్ బ్యాటింగ్ వలన బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా కనిపిస్తుంది. అదే సమయంలో జట్టులో ముగ్గురు ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు.

లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్ ల్లో భారత లోయర్ ఆర్డర్ విఫలమైంది. తొలి ఇన్నింగ్స్ లో చివరి 41 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. ఇక రెండో ఇన్నింగ్స్ లోనూ అదే పరిస్థితి. చివరి 31 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది. తొలి ఇన్నింగ్స్ లో 600 పరుగులు భావించినా కనీసం 500 పరుగులు కూడా మన జట్టు చేయలేకపోయింది. రెండో ఇన్నింగ్స్ లో 450 పరుగుల ఆధిక్యం ఖాయమనుకుంటే అనూహ్యంగా కుప్పకూలారు. శార్దూల్ ఠాకూర్, కరుణ్ నాయర్, జడేజా కనీస స్థాయిలో బ్యాటింగ్ చేయలేకపోయారు. భారత పరాజయానికి ఇదే ప్రధాన కారణం. సెకండ్ టెస్టులో టీమిండియాకు ఆ సమస్య లేనట్టు కనిపిస్తుంది.

# జైశ్వాల్ హాఫ్ సెంచరీ.. తొలి సెషన్‌లో రెండు వికెట్లు కోల్పోయిన టీమిండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరుగుతున్న ఎడ్జ్ బాస్టన్ టెస్టులో టీమిండియా మొదటి రోజు తొలి సెషన్ లో రాణించింది. ఓపెనర్ రాహుల్ విఫలమైనా.. కరుణ్ నాయర్, జైశ్వాల్ భాగస్వామ్యంతో భారత్ తొలి ఈ సెషన్ లో కోలుకుంది. జైస్వాల్ హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. ఇంగ్లాండ్ రెండు కీలక వికెట్లు తీసి పర్వాలేదనిపించింది. దీంతో తొలి రోజు లంచ్ సమయానికి టీమిండియా 25 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. క్రీజ్ లో జైశ్వాల్ (62), కెప్టెన్ శుభమాన్ గిల్(1) ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లలో వోక్స్, కార్స్ తలో వికెట్ తీసుకున్నారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ ఇన్నింగ్స్ ను ఆచితూచి ఆరంభించింది. జైశ్వాల్ పరుగులు చేయడానికి ఇబ్బంది పడితే.. మరో ఎండ్ లో రాహుల్ పూర్తిగా డిఫెన్స్ కే పరిమితమయ్యాడు. మరోవైపు ఇంగ్లాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పరుగులు చేయనీయకుండా చేశారు. క్రీజ్ లో ఉన్నంత సేపు ఇబ్బంది పడిన రాహుల్ వోక్స్ చేతికి చిక్కాడు. 26 బంతుల్లో 2 పరుగులు చేసిన రాహుల్ వోక్స్ ఇన్ స్వింగ్ కు క్లీన్ బౌల్డయ్యాడు. ఈ దశలో కరుణ్, జైశ్వాల్ జట్టును ముందకు తీసుకెళ్లారు. ఇద్దరూ ఎలాంటి అనవసర షాట్స్ కు పోకుండా జాగ్రత్తగా ఆడారు. ముఖ్యంగా కరుణ్ నాయర్ ఇంగ్లాండ్ బౌలర్లపై ఎటాకింగ్ షాట్స్ ఆడుతూ ఒత్తిడిలోకి నెట్టాడు. ఈ క్రమంలో జైశ్వాల్ తన హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. రెండో వికెట్ కు 80 పరుగులు జోడించిన తర్వాత వీరి జోడీని కార్స్ విడగొట్టాడు. 31 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కరుణ్ నాయర్.. కార్స్ బౌలింగ్ లో స్లిప్ లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. గిల్ తో కలిసి జైశ్వాల్ లంచ్ వరకు మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు.

# వారం రోజులు రెస్ట్ ఇచ్చి పక్కన పెట్టారు.. టీమిండియాపై రవిశాస్త్రి ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు అనుకున్నట్టుగానే తుది జట్టులో స్థానం దక్కలేదు. ముందు నుంచి అనుకున్న ప్రకారం వర్క్ లోడ్ కారణంగా బుమ్రాకు రెండో రెస్ట్ లో రెస్ట్ ఇచ్చారు. బుమ్రా స్థానంలో ఫాస్ట్ బౌలర్ ఆకాష్ దీప్ కు స్థానం దక్కింది. పని భారం కారణంగా సిరీస్‌కు ముందే బుమ్రా సిరీస్?లోని ఏవైనా మూడు మ్యాచులు మాత్రమే ఆడుతాడని.. మిగిలిన రెండు మ్యాచ్ ల్లో అతడి సేవలు కోల్పోతామని గిల్ రెండో టెస్టుకు ముందు క్లారిటీ ఇచ్చాడు. మ్యాచ్ కు ముందు వరకు రెండో టెస్టులో బుమ్రా ఆడతాడా లేదా అనే విషయంలో సందిగ్ధత నెలకొంది. టాస్ తర్వాత గిల్ మాట్లాడుతూ బుమ్రాకు రెస్ట్ ఇచ్చాము అని చెప్పడంతో ఈ స్టార్ పేసర్ లేకుండానే భారత జట్టు రెండో టెస్ట్ ఆడుతుంది. బుమ్రా రెండో టెస్టులో లేకపోవడంపై టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తన అసంతృప్తి వ్యక్తం చేసాడు. రెండో టెస్టుకు బుమ్రాను తీసుకోవాల్సిందిగా చెప్పుకొచ్చాడు. “వరల్డ్ బెస్ట్ టెస్ట్ బౌలర్ కు వారం రోజులు రెస్ట్ ఇచ్చి రెండో టెస్ట్ ఆడకుండా చేశారు. బుమ్రా జట్టులో లేకపోవడం నమ్మడానికి చాలా కష్టంగా ఉంది. టీమిండియా చేసిన ఈ పని నన్ను నిరాశకు గురి చేసింది”. అని శాస్త్రి అన్నాడు. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో బుమ్రా ఆడాడు. ఈ మ్యాచులో ఈ పేసర్ చెలరేగి తొలి ఇన్నింగ్స్ లో ఐదు పడగొట్టిన టీమిండియాకు ఓటమి తప్పలేదు. రెండో టెస్టులో టీమిండియా ఖచ్చితంగా గెలవాల్సిన టెస్టులో బుమ్రా ఆడతాడని ప్రచారం జరిగినా అతనికి రెస్ట్ ఇవ్వడం జరిగింది. ఐదు మ్యాచుల సిరీసులో తొలి టెస్ట్ ఆడిన బుమ్రా.. మిలిగిన నాలుగింట్లో ఏవైనా రెండు టెస్టుల మాత్రమే ఆడనున్నాడు. 5 టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా మూడో టెస్ట్ ఐకానిక్ లార్డ్స్ లో జరగనుంది. ఈ మ్యాచ్ లో బుమ్రా ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న మ్యాచ్ విషయానికి వస్తే.. తొలి రోజు లంచ్ సమయానికి టీమిండియా 25 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. క్రీజ్ లో జైశ్వాల్ (62), కెప్టెన్ శు భమాన్ గిల్(1) ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లలో వోక్స్, కార్స్ తలో వికెట్ తీసుకున్నారు. జైశ్వాల్ హాఫ్ సెంచరీతో రాణించగా.. కరుణ్ నాయర్ 31 పరుగులు చేసి పర్వాలేదనిపించాడు. రాహుల్ కేవలం 2 పరుగులే చేసి నిరాశపరిచాడు.



ఇనాయా సుల్తానా ప్రకాశవంతమైన పసుపు చీరలో కొత్త చిత్రాన్ని షేర్ చేసింది

# కొత్త పెళ్లి కొడుకు ఇబ్బంది పడకుండా ఇంటిపక్కనే!

ఇటీవలే అక్కినేని అఖిల్ ధాంపత్య జీవితంలో కి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. ముంబైకి చెందిన జైనబ్ రవ్జీని వివాహం చేసుకుని ఓ ఇంటి వాడయ్యాడు. వివాహం ఎంతో నిరాడంబరంగా జరిగింది. అక్కి నేని కుటుంబం తమ ఇంట్లోనే వివాహం జరిపించింది. అటుపై అఖిల్-జైనబ్ దంపతులు కొన్ని రోజుల పాటు హనీమూన్ కి వెళ్లి తిరిగొ చ్చారు. అనంతరం అఖిల్ పెద్దగా గ్యాప్ తీసుకోకుండాని సినిమా షూటింగ్ షురూ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అఖిల్ హీరోగా లెనిన్ చిత్రం తె రకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ షూటింగ్ కూడా అన్నపూర్ణ స్టూడియో లోనే జరగడం విశేషం. అఖిల్ విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత పెద్దగా మరోచోటకి ప్రయాణం చేయకుండానే సొంత స్టూడియోలోనే షూటింగ్ జరగడంతో హాజరవుతున్నాడు. ఇప్పటికే షూటింగ్ కొంత భాగం పూర్తయిన సంగతి తెలిసిందే. ఇంతలోనే పెళ్లికి ముహూర్తం పెట్టడంతో కొన్ని రోజులగా ఆ పనుల్లోనే పడిపోయాడు. దీంతో - లెనిన్ - షూటింగ్ అకిల్ ఏకుండా జరుగుతుంది. ఈ సమయంలో అఖిల్ లేని సన్నివేశాలు చిత్రీక రించారు. తాజా షెడ్యూల్ లో అఖిల్ పాల్గొనడంతో షూటింగ్ వేగం పుంజుకుంది. వీలైనంత త్వరగా ఈ షెడ్యూల్ పూర్తి చేయాలని చూస్తున్నారు. అటుపై విదేశాల్లో కొంత పార్ట్ షూట్ చేయాల్సి ఉందిట. దానికి సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే.

ఈ సినిమా అనంతరం అఖిల్ మరో భారీ ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఓ స్టార్ డైరెక్టర్ నే రంగంలోకి దించుతున్నట్లు అక్కినేని కాంపౌండ్ వర్గాల నుంచి లీకైంది. పెళ్లైన నేపథ్యంలో ఆ సెంటిమెంట్ కూడా కలిసొస్తుందని అకిల్ కాన్ఫిడెంట్ గా ముందుకెళ్తున్నట్లు కనిపిస్తుంది.



ప్రియాంక జవాల్కర్ వీకెండ్ మూడ్ క్యాజువల్ క్లిక్‌లతో నిండిపోయింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com